POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూన్ 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 42 సంచిక: 02



## పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనోత్సవము

(03-06-2024)

## ఈ నెల పండుగలు

జూన్ *03 - పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తృతీయ ఆరాధనా మహోత్సవము*
జూన్ *13 - అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధన (తిథి - జ్యేష్ఠ శుద్ధ సప్తమి)*
జూన్ *22 - శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి (తిథి - జ్యేష్ఠ పూర్ణిమ)*

"నిజమైన సాధకుడు తన జీవితాన్నంతా సాధన కనుకూలంగా మలచుకుంటాడు. అంటే తన సాధనకు అడ్డురాని ఉద్యోగం, స్నేహితులు, జీవితవిధానం దినచర్య అన్నీ తను వేసే ప్రతి అడుగు తన గమ్యం వైపే వేస్తాడు. తను దేనికోసం జీవితాన్ని గడుపుతున్నాడో దానికోసం సర్వాన్నీ వదిలిపెట్టడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. అలాకాక రోజూ సక్రమంగా ధ్యానం చెయ్యడానికి వీలు, టైం దొరకటము లేదనో, తాము జీవితంలో పూర్తి చేయవలయుననుకొన్న పనులు కొన్ని పూర్తి చేసి సాధన చేస్తామనో, జీవితం బాగా అనుభవించి(ఇక అనుభవింపయోగ్యం గాని ముసలి వయస్సులో)బాగా సాధన చేస్తామనో అనేవాళ్లకు అసలు సాధన అంటే ఇంకా తెలియలేదన్నమాట.

అసలు మానవుడు వుండేదే దేవుడవడంకోసం - విత్తు వుండేది చెట్టవడం కోసమయినట్లు. కాబట్టి సాధనలో జీవితం ఒక భాగమవ్వాలి అని తెలుసుకొనితీరాలి. ఇది తెలుసుకొనకుండా, సాధించకుండా, ఈ లోపల సాధన,ముక్తి అని మాట్లాడడం చిన్న పిల్లవాడి మాటలవలె అర్థ రహితం. ఇది సాధిస్తేనే సాధన మొదలైనట్లు."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# బాబా ఎప్పుడూ శిష్యునిగానే వుండదలిచారు

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

భాగవతం ఏకాదశ స్కంధంలోని అవధూత 24 మంది గురువుల నుండి జ్ఞానమార్జించి పూర్ణుడైనట్టు చెప్పినా ఆయన తిరిగి గురువు కాదలచలేదు. అందుకే బాలునిలా, ఉన్మత్తునిలా, పిశాచగ్రస్థునిలా నిర్జనమైన అరణ్యంలో కటిక నేలమీద ఏకాంతంగా కూర్చొన్నాడు. అదే సంప్రదాయం శిరిడీ సాయినాథునిది. పూర్ణుడైన గురువును నిరంతరం 12సం॥ సేవించి మహనీయుల కూటమికి సామ్రాట్టయినా, ఆయనెవరికీ గురువు కాదలచలేదు. సరిగదా ఆయనంతటివారిని శిష్యునిగా భరించగల వారుండాలే గాని, ఆయనింకా శిష్యుడుగానే వుండాలని ఉబలాటపడ్డట్లు కన్పిస్తుంది. జవ్హర్ అలీ అను కపట గురువొచ్చి ఆయన తన శిష్యుడని చెప్పుకొంటే ఆమోదించి ఆనందంగా ఆయనను అనుసరించారు. చివరికా శిష్యుని భరించలేక ఆ గురువు పారిపోయి, యీసారి భక్తుడై క్షమాపణ చెప్పకోడానికి వచ్చాడు.

చరిత్ర పొడుగునా మానవులలో యిదే వైఖరి కన్పిస్తుంది. సిద్ధార్థుడు ఒక వృద్ధుణ్ణి, ఒక రోగిని, ఒక శవాన్ని చూచి కలత చెందిపోయి జీవన్మరణాల రహస్యం తీవ్ర తపస్సుతో సాధించాడు. దుఃఖంతో మునిగిపోతున్న మానవాళిపై అపారమైన వేదనతో తనకు మిగిలిన జీవిత శేషమంతా - అది తనకెందుకూ పనికిరాదు గనుక - దుఃఖవిముక్తి మార్గం ప్రజలకు చెప్పసాగాడు. ఆయన ఆశించని రీతిన రాజు దగ్గర నుండి నిరుపేదలదాకా ఆయన వద్దకు జనం చేరారు. కాని అది చూచి ఆనందునికి ఈర్ష్య కలిగింది. భక్తులను నిలదీసి బుద్ధునిపై ధ్వజమెత్తాలని చూచాడు. ఆయన చేసిన తపస్సుగాని,



మానవజాతి భవితవ్యంపై ఆయనకున్న కరుణగాని లేకున్నా, ఆయనకు సంక్రమించిన ప్రజాదరణపై ఆశ కల్గింది. బౌద్ధ సంఘంలో ఆధిపత్యం కావలసివచ్చింది. బుద్ధుని సన్నిధిలో అంతకాలమున్నా అతనిలో ఆ బలహీనత తొలగలేదు. కేవలం మానవజాతి యొక్క అదృష్టం వలన, అలనాటి బుద్ధుని శిష్యుల, భక్తుల వివేకం వలన మాత్రమే చరిత్రలో సత్యం జయించింది.

ఇట్టి పోకడ మన దేశానికి మాత్రమే పరిమితం గాదు. జీసస్ మరికొద్దికాలంలో తాను శిలువేయబడి మరణిస్తానని చెప్పసాగాడు. అంతలో అతని శిష్యులలో సద్దులేని సంచలనం ఆరంభమైంది. ఆయన కాస్తా చనిపోయాక వారిలో ఎవరు నాయకత్వం వహించాలన్న ప్రశ్న తలెత్తింది - వారు మరి పదికాలాలపాటు ఎలా వుంటారా అనికాదు! ఆయన ఏకాంతంగా ప్రార్థన చేసుకొచ్చే లోపలే 12 మంది శిష్యులు ఒకచోట చేరి ఆ విషయం చర్చించుకొంటున్నారు. ఆయన తిరిగిరాగానే

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 జూన్ - 2024 సంచిక:02

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | బాబా ఎప్పుడూ శిష్యునిగానే వుండదలిచారు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి నర్మద | 10 |
| 05. | గురుస్మరణయే తన ఊపిరిగా -- మాతృశ్రీ అలివేలు మంగమ్మ జీవన గమనం | శ్రీమతి శ్రీదేవి | 12 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 16 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 18 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 20 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ న్యాయపతి వినీత్ | 26 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి శిరీష | 28 |



**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**



చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

చటుక్కున చర్చ నిలిపి వినయ విధేయతలతో చేతులు ముడుచుకొని, నమ్రతతో తలవంచి నిలబడ్డారు. 'ఏమిటి మీ చర్చ?' అని ఏసు అడిగారు. కాని శిష్యులు చెబుతారా? 'ఏమీ లేదు' అన్నారు. వెంటనే ఆయన ఒక బిందెతో నీళ్ళు తెచ్చి వాళ్ళందరి కాళ్లూ కడగ నారంభించాడు. శిష్యులు నివ్వెరబోయి వారి భావమడిగారు. ఆయన, "ఎవరు పాదసేవ చేయడానికి సిద్ధమో వారే నాయకత్వానికి అర్హులు; ఎవరు నాయకత్వం కోసం తపిస్తారో వారు పాదసేవ చేయడానికి కూడా అర్హులు గారు" అన్నారు. అప్పటికి అర్థమైంది ఆ శిష్యులకు – తమ పొరబాటు. ఆయనలాగ వారు యిల్లు విడిచిపోయి సుమారు 12సం॥ తపస్సు, సంచారమూ చేయలేదు. 40 రోజులు ఎడారిలో నిరాహారులై తపస్సు చేసి జ్ఞానం పొందలేదు. ఆయనవలె యూదు జాతియొక్క అహంకారాన్ని దౌష్ట్యాన్ని ఎదుర్కోలేదు. అమాయిక ప్రజలకాయన చేసిన సేవా చేయలేదు. ఆయనవలే సత్యాన్ని ప్రచారం చేయడానికి వారు తమ సర్వస్వమూ పణంగా పెట్టలేదు. రోమన్ పాలకుల ఆగ్రహం ఆయనపై కేంద్రీకృతమైనప్పుడు ఆపత్సమయంలో ఆయన ప్రక్కన నిలవనూలేదు. ఆయనను రోమన్ సైనికులు, బంధించినపుడు అందరూ తలోకవైపు పారిపోయారు. కాని తర్వాత నాయకత్వం, కీర్తి, అధికారము మాత్రం అందరికీ కావలసి వచ్చింది. నిజానికి జ్ఞానము, భక్తి, త్యాగము, తపస్సు, కష్టమూ ఆయనవి. అధికారము, కీర్తి అంతా వీరిది. పొలం దున్నేవి ఎద్దులు; ధాన్యమనుభవించేది 'మనిషి'

సిక్కుల ఎనిమిదవ గురువు హరిక్రిషన్ సమాధి చెందబోతుంటే ఒక భక్తుడు కన్నీటితో, "ఇక మాకు మార్గం చూపేదెవరు"అని ప్రశ్నించాడు ఆయన, "నేను వెళ్ళిపోయాక 'బాబా బాకాలా' అనే గ్రామంలో తర్వాతి సద్గురువు మీకు లభిస్తారు" అని చెప్పి చివరిశ్వాస విడిచారు. వెంటనే భక్తులు కొందరు వెళ్ళి ఆ గ్రామమంతా గాలించారు గాని అక్కడ అందుకర్హులైన వారెవరూ కన్పించలేదు. అదే అవకాశమని తలచి గురు హరికిషన్ గారి గద్దెకు తామే వారసులమంటూ, సద్గురువులమంటూ ఆయన శిష్యులే యిరవై యిద్దరు బయలుదేరారు. కాలంలోనే మఖ్ఖన్ షా అను శిష్యుని ఓడ పర్షియా నుండి మన దేశానికి అతి విలువైన సరకు తెస్తూ గాలివానలో చిక్కుకొని అక్కడక్కడా పగుళ్ళు బారి మునిగిపోబోతోంది. మఖ్ఖన్ షా నౌకలో మొకరిల్లి నౌక భద్రంగా బొంబాయి చేరితే అయిదువందల బంగారు నాణేలు దక్షిణగా సమర్పించుకుంటానని తన సద్గురువు హరికిషన్ ను ప్రార్థించాడు. తక్షణమే గాలివాన నిలిచిపోయి, నౌక కొచ్చిన బీటలు మూసుకొని అతి త్వరగా నౌక బొంబాయి చేరింది. అతడెంతో ఆత్రంగా కానుక తీసుకుని వచ్చేసరికి గురు హరికిషన్ నిర్యాణ మయ్యారనీ, వారి వారసుల కోసం 'బాబా బాకలా' గ్రామంలో వెదకాలనీ చెప్పారు. అతడక్కడకు చేరేసరికి ఆ యిరవై రెండు మంది శిష్యులు కీచులాడుకోవడం చూచాడు. వారిలో నిజమైన సద్గురువు తన సంగతి తాను చెప్పకుండానే తెలుసుకొనగలుగుతారన్న నమ్మకంతో ఆ కానుక సంగతి చెప్పకుండా యిరవై యిద్దరిలో ఒక్కొక్కరినీ దర్శించాడు. కాన్ని వారిలో ఒక్కరూ అతని విషయమే పసిగట్టలేక పోయారు. ఇంతలో గ్రామంలోనే ఒక పాడుబడ్డ ఇంట్లో తేజ్ బహదూర్ అను సాధువు ఏకాంతంగా నివసిస్తున్నారని తెలిసి ఆయనను దర్శించి, అయిదు బంగారు నాణాలు దక్షిణగా సమర్పించాడు. వెంటనే ఆయన, "ఇదెక్కడి న్యాయం? కష్టంలో వున్నపుడు అయిదువందల బంగారు నాణాలు సమర్పిస్తానని చెప్పి కష్టం తీరాక అయిదే సమర్పిస్తావేమి?" అంటూ తమ భుజాలపై చొక్కా తొలగించి, లోతైన గాయాలూ చూపుతూ, "మునగుతున్న నీ నౌకను మోసేసరికి యెలా పుండ్లు పడ్డాయో చూడు!" అన్నారు వెంటనే అతడు తనకు సద్గురువు లభించినందుకు సంతోషించి కానుక సమర్పించాడు. వెంటనే ప్రక్కనున్న మేడపైకెక్కి, "నాకసలైన సద్గురువు లభించారు!" అని ఎలుగెత్తి చాటాడు.

సద్గురువు దొరకక శిథిలమవుతున్న ఆధ్యాత్మ సంప్రదాయమే మునుగుతున్న నౌక. కపట శిష్యుల కీచులాటలే గాలివాన. నిజమైన శిష్యుల ప్రార్థనయే సిసలైన సద్గురువు దొరికేలా చేస్తుంది. అటుపై సత్సంప్రదాయం కథ కంచికి వెళుతుంది. అటుపై బాధలన్నీ సద్గురువులవి – చల్లని సుఖమంతా శిష్యులదీ, భక్తులదీ. అదే జహంగీరు సారథ్యంలో నడచిన నౌక. శిరిడీ సాయినాథుడే దానిని కాపాడిన సద్గురువు. 'శ్రీ గురు చరిత్ర' 'సాయిబాబా జీవిత చరిత్ర' పారాయణలే నేటి మఖ్ఖన్-షా లు చేయవలసిన ప్రార్థనలు.●


# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- సన్యసించనిదే మోక్షము లేదని కొన్ని గ్రంథాలు, మహాత్ములు చెప్పారు. నిజమేనా ?**

**- డి. కనకముత్యము, యండగండి**

**జవాబు** :-సర్వజీవుల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతూ, ధర్మ బద్ధమైన భుక్తి సంపాదించుకొనేవారికి కేవలం దైవస్మరణ చాలు. అలాగాక చిలిపిగా బ్రతికే వారి పిల్లలకు ఉపనయనము, బ్రహ్మచర్యములనే సంస్కారమివ్వకుంటే వారిలోనూ, వారివల్ల ప్రపంచములోను అధర్మం ప్రబలుతుంది. బ్రహ్మచర్యంలో నేర్చిన విద్య, అలవర్చుకున్న సదాచారాలతో మాత్రమే గృహస్థాశ్రమం సక్రమంగా నిర్వర్తించాలి. వారికి మాత్రమే సన్యాసము సార్థకము, అవసరము. బాధ్యతలు తీరాక ఆశ, మమకారము విడిచినవారికే ముక్తి సాధ్యం. అట్టివారికి మాత్రమే సన్యాసమివ్వాలి. ఆశ విడవలేనివారు సన్యసిస్తే అది మిధ్యాచారమై రెంటికీ చెడతారు. మానవులలో ఎక్కువమంది ఈ క్రమంలోనే ముందుకు పోవాలి. చాలా అరుదుగా రామకృష్ణ పరమహంస, రమణమహర్షివంటి ఏకొద్దిమందో పూర్వ సంస్కారబలం వలన మొదటినుండే సర్వసంగ పరిత్యాగులవగలుగుతారు. మిగిలినవారు అలా చేయకూడదని వేదం స్పష్టంగా చెప్పింది. గీతలో కూడ కర్మలన్నీ శాస్త్రవిధి ననుసరించి ఆచరిస్తూ వాటి ఫలంపట్ల ఆసక్తిని మాత్రమే సన్యసించాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. క్రొత్తగా సన్యసించినవారికి తమ ఆశ్రమంపై శ్రద్ధ బలపడటానికి పెద్దలు వ్రాసిన గ్రంథాలు యీనాడు ప్రజలు స్వతంత్రించి తమకైతామే చదువుకోవడంవల్ల,



కీర్తిని, డబ్బును ఆశించి ధర్మప్రచారానికి దిగడంవలన యిట్టి అపోహలు కల్గుతున్నాయి. సన్యాసం బాహ్యమైనది మాత్రమే అయితే మీ ప్రశ్నకు తావున్నది. ఆంతరంగికమైతే ప్రశ్నేరాదు. వివేక వైరాగ్యాలు సంపాదించి గూడ లౌకిక ధర్మాలు పాటించడం వుత్తమమని శ్రీకృష్ణుడు చెప్పాడు. అందుకే సాయి ఎవరినీ సన్యసించమనలేదు. ●

(ఫిబ్రవరి 2016 సాయిబాబా మాసపత్రిక నుండి)

# ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు

(గత సంచిక తరువాయి)

## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

వాళ్ళు వెళ్ళిన తరువాత మరొక్కసారి కాఫీ సేవించారు. తరువాత ఆయన ఏదో పుస్తకం తీసి చదవడానికి వుపక్రమించారు. కొద్ది పేజీలు చదివారో లేదో ముద్రణాలయం (ప్రింటింగ్ ప్రెస్) నుంచి పత్రిక తాలూకు ప్రూఫులు దిద్దడానికి కాగితాలు వచ్చాయి. ఆయన చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కన పెట్టి ప్రూఫులు దిద్దనారంభించారు. యింతలో పోస్ట్-మాన్ వచ్చి వుత్తరాలకట్ట యిచ్చివెళ్ళాడు. మరికొంత సేపటికి మరి యిద్దరు కొత్తవారు వచ్చి, "నమస్తే సార్" అంటూ హాలులోకి అడుగుపెట్టారు. అప్పుడు ఆయన తమ హృదయాన్ని స్పృశిస్తూ, "నమస్తే, నమస్తే" అంటూ వారిని లోపలికి వచ్చి కూర్చోమని చెప్పి, "బాగున్నారా? మంచినీళ్ళు కావాలా?" అని అడిగి "ఒక్క నిముషం" అంటూ ప్రూఫులు దిద్దడం పూర్తిచేసి ప్రెస్ కి పంపించారు. తరువాత వచ్చిన వారితో మాట్లాడి, వారు వెళ్ళిన తరువాత వుత్తరాలు పరిశీలించారు. వెంటనే వాటికి జవాబులు వ్రాయడం ప్రారంభించారు. అప్పటికి మధ్యాహ్నం గం॥12-30ని॥లు దాటుతున్నది. చి॥వేదవతి, ద్వారకలు కూడా స్కూలునుంచి రావడంతో భోజనానికి లోపలికి వచ్చారు. కాళ్ళు, చేతులు, ముఖము కడుక్కుని భోజనానికి కూర్చున్నారు. తర్వాత కొన్ని వుత్తరాలకు జవాబులు చెబుతూ చి॥రామారావు చేత వ్రాయించారు. భోజనాలు అయ్యాక మరికొన్ని వుత్తరాలకు జవాబులు స్వయంగా వ్రాశారు. అవి పూర్తయిన తర్వాత శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి విరచితమైన 'సమశ్లోకి' (ఏడువేల శ్లోకాలున్న) శ్రీ గురుచరిత్ర చదవడం ప్రారంభించారు. ఆ పుస్తకంలోని శ్లోకాలు చదువుతూ ముఖ్యమైన విషయాలను అండర్లైన్ చేస్తున్నారు. ఆయన అప్పుడు ఆ శ్రీ గురుచరిత్రను తెలుగులో వ్రాయాలని సంకల్పించారు. అంతకుముందు 'సంహితాయన గురుద్విసాహస్రి' శ్రీ వాసుదేవానంద సరస్వతీస్వామి విరచిత రెండు వేల శ్లోకాల శ్రీ గురుచరిత్రను తెలుగులో రచించారు. యిప్పుడు ఆయన ఏడువేల శ్లోకాలున్న శ్రీ గురుచరిత్రను తెలుగులో వ్రాయాలని సంకల్పించడంతో ఆ పుస్తకాన్ని చదవడం ప్రారంభించారు. అంతేకాక, కన్నడ భాషలో వున్నటువంటి శ్రీ గురుచరిత్రను, యింకా యితర భాషలలో వున్న శ్రీ గురుచరిత్రలను సేకరించారు. తెలుగులో వున్న శ్రీ గురుచరిత్రలను చదివారు. ఏయే పుస్తకాలలో శ్రీ గురుచరిత్రను ఎలా వ్రాశారో చూసి వాటిల్లో ముఖ్యమైన, ప్రత్యేకమైన అంశాలను తీసుకున్నారు. యిందులో భాగంగానే తనకు శ్రీ గుళవణి మహరాజ్ (శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి శిష్యులు) గారు ప్రసాదించిన శ్రీ గురుచరిత్ర 'సమశ్లోకి' చదువుతున్నారు. కొంతసేపు చదివాక ఒక అరగంట విశ్రాంతి తీసుకున్నారు. సరిగ్గా మూడున్నర గంటలకు ఆయన నిద్రలేచి కాఫీ తీసుకుని స్నానం చేసి గం॥ 4.00ల సమయంలో హాలులోకి వెళ్ళి కూర్చున్నారు. అప్పటికే కొందరు భక్తులు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం కోసము వేచి వున్నారు.

వారిలో ఒక దంపతులు పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరించుకుని యిలా అన్నారు, "మాస్టరుగారూ! మాకు వివాహం జరిగి 10సం॥లు అయింది. కానీ సంతానం కలుగలేదు. మీరేదైనా చెబుతారని మీ దగ్గరికి వచ్చాము. మీ ఆశీస్సులతో మా కోరిక నెరవేరుతుందని భావిస్తున్నాము. మీ ఆశీస్సులు మాకు కావాలి" అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు, "నా ఆశీస్సులేమిటి? అందరికీ బాబా ఆశీస్సులు కావాలి. ఆయన ముందు నేనెంత? ఆయన గొప్పతనాన్ని రుచి చూశాను గనుక ఆయన అనుగ్రహం అందరూ పొందాలని ఆయన గురించి నాకు తోచింది చెబుతూ వుంటాను" అంటూ, "మీరు శ్రీ సాయిలీలామృతం చదివారా?" అని అడిగారు. అందుకు అతను "లేదు సార్! బాబా గురించి మాకు ఏమీ తెలియదు. మాకు తెలిసిన వారొకరు మీ గురించి చెప్పగా వచ్చాము, అంతే" అన్నాడు. అప్పుడు మాస్టరుగారు "శ్రీ సాయి లీలామృతము మీరు చదవండి. అప్పుడు బాబా గురించి మీకు తెలుస్తుంది. ఆ పుస్తకాన్ని ఈ కోరికతో సప్తాహ పారాయణ చేయండి. అంటే బాబాకు మీ సమస్య చెప్పుకొని ఒక గురువారం మొదలు పెట్టి బుధవారానికి పూర్తిచేయాలన్నమాట. మళ్ళీ గురువారం మొదలు పెట్టాలి. అలా వరుసగా ఒక్కరోజు కూడా ఆపకుండా పారాయణ చేస్తుండాలి. ఆహారంలో మీకు యిష్టమైన పదార్థం బాబాకు వదిలిపెట్టాలి. సంతానం కలిగిన తరువాత ఒక గురువారం నాడు వదిలేసిన పదార్థాన్ని బాబాకు నైవేద్యం పెట్టి అప్పటినుంచి తీసుకోవచ్చు. సంతానం కలిగితే ఆ బిడ్డను తీసుకొని శిరిడీ వస్తామని, ఆ బిడ్డకు ఆయన పేరు కలిసివచ్చేలా పేరు పెట్టుకుంటామని మొక్కుకోండి" అని చెప్పారు. ఇంతలో అతని భార్య అందుకుని "మాస్టరుగారూ, నేను యిలాంటివెన్నో చేశాను. విష్ణుసహస్రనామ పారాయణ, లలితాసహస్రనామ పారాయణ, ఆంజనేయస్వామి గుళ్ళో ప్రదక్షిణలు, పాము పుట్టలో పాలుపోసి పుట్టకు ప్రదక్షిణలు చేయడము, యిలా ఎవరేది చెబితే అదల్లా చేశాను. అందుకని నాకు ఈ పారాయణలలో నమ్మకం లేదు" అన్నది.

అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా అన్నారు "అమ్మా, నువ్వు యివన్నీ చేస్తే చేశావు. ఇన్ని చేశావు కదా, ఈ ఒక్కటి కూడా ప్రయత్నిస్తే తప్పేముంది? శ్రీ శిరిడీ సాయిబాబా సామాన్యులు కారు. ఆయన మన విధినే మార్చగల సమర్థులు. ఆయన అనుగ్రహం వుంటే జరగనిది ఏమీ లేదు. పది సంవత్సరాలే కాదు, యిరవై సంవత్సరాలపాటు పిల్లలు లేనివారికి కూడా ఆయన సంతానం ప్రసాదించారు. ఈ సంగతి ఆయన చరిత్ర చదివితే నీకే అర్థమౌతుంది. చంద్రబాయి బోర్కర్ అనే ఆమెకు 51 సం॥ల వరకూ సంతానం కలుగనేలేదు. బాబా ఒక రోజు ఆమెను, "అమ్మా! నీకేమి కావాలి?" అని అడిగారు. ఆమె, "మీకు సర్వమూ తెలుసు బాబా! అటువంటి మీకు నా సంగతి తెలియదా?" అన్నది. ఆమెకు సంతానం కావాలనే కోరిక వున్నది. అప్పుడు బాబా, "అల్లా అచ్చా కరేగా!" అన్నారు. ఆ తర్వాత బాబా సమాధి చెందారు. అయినప్పటికీ కొన్ని సంవత్సరాల తర్వాత ఆమెకు సంతానం కలిగింది. ఆ వయస్సులో ఆమెకు సంతానం కలగడం అసంభవం అని డాక్టర్లు అన్నారు గాని ఆ డాక్టర్ల అభిప్రాయాన్ని వమ్ము చేస్తూ ఆమెకు సంతానం కలిగింది. బాబా సమాధి చెందిన తరువాత కూడా యిలా ఎంతమందికి సంతానం ప్రసాదించారో! యిలాగే నాకు తెలిసిన ఒకామెకు 20 సంవత్సరాలపాటు సంతానం కలుగలేదు. ఎంతమంది జ్యోతిష్కులకు చూపించినా ఆమెకు సంతానప్రాప్తి లేదనే చెప్పారు. అయినప్పటికీ బాబా పారాయణ చేస్తే వారికి యిద్దరు పిల్లలు కలిగారు. అందుకని మీరిరువురూ నేను చెప్పినట్లు పారాయణ చేయండి" అని చెప్పారు. అప్పుడు ఆమె భర్త "అదంతా కాదు మాస్టారూ! మిమ్మల్ని దర్శించగానే మీ ఆశీస్సులు వుంటే చాలని మాకు అనిపిస్తోంది. మీరు మాకు ఆశీస్సులు ప్రసాదించాలి" అని ప్రార్థించాడు. అందుకు పూజ్యశ్రీ మాస్టరు గారు, "నేను చెప్తున్నాను కదా! నేను చెప్పినట్లు బాబా పారాయణ చేయండి. ఆయన అనుగ్రహం ఎంతటిదో మీకే తెలుస్తుంది" అంటూ యిరువురికి ఊదీ యిచ్చి పండ్లు ప్రసాదంగా యిచ్చారు. అలా ఆయన ఆశీస్సులు లభించినందుకు ఆ దంపతులెంతో ఆనందించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు అందరికీ ఊదీ చేతిలో పెట్టి నొసటను కూడా ఊదీ పెట్టేవారు. ఆ తర్వాత ప్రసాదంగా తన దగ్గరున్న పండ్లు గాని మరేదైనాగాని ప్రసాదంగా యిచ్చేవారు. ఆడవాళ్ళకు చేతిలో ఊదీ మాత్రమే యిచ్చేవారు. తర్వాత మిగతావారు కూడా తమ సమస్యలను, సందేహాలను పూజ్యశ్రీ మాస్టరుగారికి విన్నవించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు వారి సమస్యలకు పరిష్కార మార్గాలను, వారి సందేహాలకు తగిన సమాధానాలు చెబుతూ - మధ్యమధ్యలో బాబా లీలలను జోడిస్తూ, బాబా తత్వాన్ని బాబా మహోన్నత స్థితిని వివరిస్తూ వున్నారు. దత్తాత్రేయ తత్వాన్ని, దత్తావతారాలైన అక్కల్కోట స్వామి, శ్రీ నరసింహ సరస్వతీ స్వామి మొ॥నవారి గురించి కూడా క్లుప్తంగా చెప్పారు. ఆయన అలా మాట్లాడుతూ

వుండగానే మరికొందరు కూడా వస్తూవున్నారు. వారు కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి అమృతవాక్కులను మైమరచి వింటున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రశ్నలు అడిగినవారికి సమాధానాలు, సమస్యలతో వచ్చిన వారికి పరిష్కారాలు చెబుతూ వున్నారు.

తర్వాత అక్కడ కూర్చున్న వారిలో ఒకరు యిలా ప్రశ్నించారు, "మాస్టరుగారూ! 'సర్వసమర్పణము' అంటారు కదా! 'సర్వసమర్పణము' అంటే ఏమిటి? అంటే అన్నీ ఆయనకు (బాబాకు) యిచ్చివేయడమా? అంటే అన్నీ వదులుకొన్నట్లే కదా?" అందుకు మాస్టరుగారు, 'సర్వసమర్పణ' మంటే అన్నీ వదులుకోవడం కాదు. అన్నీ ఆయనవే అనే గుర్తు కలిగివుండడం. ఉదాహరణకు ఈ శరీరం వున్నదనుకో; 'నాకు ఈ శరీరాన్ని యిచ్చి ప్రజ్ఞను ప్రసాదించింది నీవే. దానిని నీదిగా వుపయోగిస్తాను', అని భావించడం. 'ఈ వుద్యోగం, భార్యాపిల్లలు, నాకున్న సంపద నీవిచ్చినవే. అవి నీవిగా భావించి వుపయోగించుకునేలా అనుగ్రహించు' అని భావించడం. ఇలా ఆలోచించిన కొద్దీ ఈ సృష్టిలోని ప్రతిదీ ఆయన ప్రసాదించినదేనని అర్థమౌతుంది. ఉదాహరణకు మనము పీల్చే గాలి, నీరు, నిప్పు, ఆకాశము, భూమి – అంటే ఈ పంచభూతాలు – వీటిని ఎవరు ప్రసాదించారు? మనమేమీ వీటిని తెచ్చుకోలేదు కదా! మనము పండించుకోకముందు కూడా చెట్లు, మొక్కలు, ఫలాలను, ధాన్యాలను ప్రసాదిస్తూనే వున్నాయి. వాటినే మన తెలివితేటలతో మనం వుపయోగించుకుంటున్నాము. అయితే ఈ తెలివిని ఎవరు యిచ్చారు? అది మన సొంతంగా రాలేదు కదా! ఒక జీవి జన్మించడానికి తగిన స్థానాన్ని, శరీర నిర్మాణాన్ని, అది జీవించవలసిన విధానాన్ని, దానికి కావలసిన ఆహారాన్ని యింత చక్కటి కూర్పుతో ఎవరు తయారు చేశారు? ఇవన్నీ వున్నప్పటికీ ప్రాణశక్తి ఒకటి వున్నది. ఆ ప్రాణం పోతే ఆ జీవికి చైతన్యం లేదు. అంటే అది ఎటువంటి కర్మలూ చేయలేదు. నేడు ఎంతగా విజ్ఞానం అభివృద్ధి చెందినా జీవికి ప్రాణం పోయడం సాధ్యపడడం లేదు. వీటన్నింటికీ మూలకారణమైన ఆ చైతన్యాన్ని 'భగవంతుడు' అంటారు. అందుకని ఈ శరీరాన్ని కూడా ఆయనే యిచ్చాడన్న గుర్తింపుతో 'నీవే అనుక్షణమూ నన్ను నడిపించు' అని భావించడం సర్వసమర్పణమంటే. అంతేకాని అన్నీ వదులుకోమని కాదు. మన లౌకిక కార్యకలాపాలు నెరవేర్చుకుంటూ ఈ భావన చేయడం అలవరచుకోవాలి. అప్పుడు మన నడత మారిపోతుంది. మనవల్ల యితరులకు శ్రేయస్సు కలుగుతుంది".

ఇంతలో అక్కడ వున్నవారిలో మరొకతను, "భగవంతుడు కనిపించడు కదా, ఆయన వున్నాడని నమ్మేదెలా సార్?" అని ప్రశ్నించాడు. అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు, "అయితే కనిపించని దేనినీ నీవు నమ్మవా?" అని అడిగారు. అందుకు అతడు, "కనిపించని దేనినైనా ఎలా నమ్ముతాము?" అన్నాడు. అప్పుడు మాస్టరుగారు, "నీవు నీకు మనస్సు బాగున్నదనో, బాగా లేదనో అంటున్నావనుకో, అసలు మనస్సంటే ఏమిటి? ఆలోచనలు ఎక్కడ నుండి పుడుతున్నాయి? అట్టి మనస్సు నీకు కనిపిస్తున్నదా? మరి వున్నదా, లేదా? భౌతికముగా మన మెదడు శరీరాన్ని పనిచేసేలా చేయవచ్చు. కానీ 'ఆ మెదడులో పనిచేయించే శక్తి ఎక్కడ వున్నది? ఎట్లా వున్నది?" అంటే చెప్పగలమా? జీవుడు జన్మించినప్పుడు ఎక్కడ నుంచి వస్తాడు? మరణించినపుడు ఎక్కడకు పోతున్నాడు? ఈ మధ్యలో ఈ శరీరాన్ని నడిపించేది ఏమిటి? శరీరం నుంచి ఆ శక్తి పోయిన తరువాత ఒట్టి జడపదార్థమే వుంటున్నది కదా? అప్పుడు ఆ శక్తి ఎక్కడికి వెళుతుందో ఆ తర్వాత ఏమౌతుందో మనకు తెలియదు. యిట్లా సంశయాలు వచ్చినవారు దానిని గురించి ఆలోచించి, పరిశోధించి ఒకానొక అనుభవాన్ని పొందారు. ఏ మార్గమునుంచైనా అట్టి అనుభవాన్ని పొందినవారు చెప్పేదొక్కటే. ఈ జగత్తును సృష్టించేది, నడిపించేది, లయింపజేసేది ఒకే ఒక్క చైతన్యము. ఆ చైతన్యము వివిధ రకాలుగా తనలోతాను మార్పులు చెంది ఈ జగత్తుగా ఏర్పడిందని, అది నిరాకారమని చెప్పారు. అయితే ఆ శక్తినే కొందరు సాకారముగా భావించి, ఏ రకముగా అయితే భావించారో అట్టి రూపంగా దర్శించారు. అందుకని ఆ శక్తి లేదని చెప్పగలమా? ఆలోచించు" అంటూ యింకా అనేక విధాలుగా భగవంతుడున్నాడని తెలియచెప్పి చివరకు యిలా అన్నారు. "నేను వ్రాసిన 'ఏదినిజం?', 'విజ్ఞాన వీచికలు' చదువు. నీకు బాగా అర్థమౌతుంది. ఇప్పుడు మొదటిసారి విన్నావు కాబట్టి నీ మనస్సుకు ఒక్కసారిగా ఎక్కకపోవచ్చు. మరలా ఆ పుస్తకాలు చదివితే బాగా అర్థమౌతుంది" అన్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు రెండు గంటల సేపు అనర్గళంగా, అవిరామంగా భగవంతుని వునికిని గురించి చెప్పుకుపోయారు. అదంతా ఈ వ్యాసములో చెప్పడం సాధ్యంకాదు. ఆయన చెప్పిన అమృతవచనాలను అక్కడున్న

*మిగతా 27వ పేజీలో*

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి నర్మద, అద్దంకి**

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని అద్దంకి వాస్తవ్యురాలైన శ్రీమతి నర్మదగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు–

1992 వ సంవత్సర ప్రాంతంలో మేమంతా ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి ఇంటి వెనక వైపున వున్న గదులలో వుండేవాళ్ళం. మా నాన్నగారు అయ్యప్పగారు వ్యాపారంలో నష్టపోయి ఆర్థికంగా బాగా దెబ్బతిన్న పరిస్థితులలో పూజ్యశ్రీ అమ్మగారు మాకు అక్కడ వుండే భాగ్యం కల్పించారు. ఇప్పుడనిపిస్తుంది, అది ఎన్నో జన్మల పుణ్యఫలమని!!

పూజ్యశ్రీ అమ్మగారంటే మాకు పూజ్య భావం వుండేది కానీ, అంతకుమించి వారి స్థితిని తెలుసుకోలేకపోయాము. అయితే కొన్ని సేవలు చేసుకునే అవకాశం పూజ్యశ్రీ అమ్మగారే మాకు కల్పించారనిపిస్తుంది. రోజూ రాత్రిపూట నేను మా అమ్మతో కలిసి పూజ్యశ్రీ అమ్మగారికి కాళ్ళకు, చేతులకు నూనె రాసే సేవ కొద్ది రోజులు చేసుకున్నాను. మా అమ్మ మాత్రం ఇంచుమించు ప్రతిరోజూ చేసుకుంది. నేను పగటి పూట కళాశాలకు వెళ్లిపోయేదాన్ని.

1997 లో నాకు మా బావతోనే వివాహమైంది. మా అత్తగారి వూరు అద్దంకి. నాకు దాదాపు పదిసంవత్సరాల వరకు పిల్లలు పుట్టలేదు. మా సంసారంలో కొంచెం సమస్యలు వుండేవి. ఒంగోలు వచ్చినప్పుడల్లా నా సమస్యలన్నీ పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పుకునేదాన్ని. "ఏం ఫరవాలేదు, అన్నీ సర్దుకుంటాయి!" అని వారు చిరునవ్వుతో చెప్పేవారు.

మావాళ్ళు సంతానం లేదని నన్నొక సిద్ధాంతిగారి దగ్గరకి తీసుకెళ్లి జాతకం చూపించారు. ఆయన నాకు పిల్లలు పుట్టరని చెప్పారు. ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పి బాగా ఏడ్చాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "ఎందుకలా బాధపడతావ్? నీకు తప్పకుండా పిల్లలు పుడతారు! మనకి ఏది లేదో దానిని ప్రసాదించే గురువుగారిని పట్టుకున్నాం!!" అని ఓదార్చారు.

పూజ్యశ్రీ అమ్మగారు గాణ్గాపురం యాత్రకి వెళ్ళినప్పుడు మేము కూడా వెళ్లాం. అక్కడ మేడిచెట్టుకి నాచేత ఉయ్యాల కట్టించారు. శ్రీగురుచరిత్ర ద్విసప్తాహ పారాయణ, దానితోపాటు కొన్ని ఆహార నియమాలు చెప్పారు. అదేవిధంగా ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం వెనుక వున్న రావిచెట్టుకి, వేపచెట్టుకు ప్రదక్షిణలు చెయ్యమన్నారు. అక్కడ కూడా ఉయ్యాల కట్టించారు.

పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినవన్నీ పాటిస్తూ, మావాళ్లు చెప్పే వైద్యం చేయించుకుంటూ వుండేదాన్ని. 8 సంవత్సరముల తరువాత ప్రత్యేక వైద్యం కోసం హైదరాబాదుకు వెళ్ళాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు చిక్కడపల్లిలో వుండేవారు. వైద్యం చేయించుకునే ముందు పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులు తీసుకుందామని దర్శనానికి వెళ్ళాము. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నేను పారాయణ చేసే విధానం మార్చారు. శ్రీ గురుచరిత్ర ప్రతిరోజూ ఏకాహ పారాయణ చేయమన్నారు. ఆ రోజు నాకు రెండు స్వీట్స్ కలిపి ఒకటిగా ముద్దచేసి ప్రసాదంగా ఇచ్చారు!

కొద్దిరోజులలోనే నేను గర్భవతిని అయ్యాను. అది పూర్తిగా పూజ్యశ్రీ అమ్మగారి దయ! ప్రతి నెలా ఒంగోలునుంచి హైదరాబాదులో వైద్య పరీక్షకు మా అమ్మని తోడు తీసుకుని



వెళ్లేదాన్ని. 7 వ నెలలో నేను, మావారు వెళ్ళాం. అకస్మాత్తుగా నాకు నొప్పులు వచ్చాయి. అప్పుడు నన్ను డాక్టరుగారు ఆసుపత్రిలో చేరిపొమ్మన్నారు. పూజ్యశ్రీ అమ్మగారు మా నాన్నని ప్రతిరోజూ రెండు కొబ్బరికాయలు ధునిలో వెయ్యమన్నారు. అంతేకాదు! మా నాన్నని కూడా హాస్పిటల్ పక్కనే ఒక గది అద్దెకు తీసుకుని వుండమని చెప్పారు. అసలంత దగ్గరలో గది దొరకటం కష్టమైనప్పటికీ, పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల పక్కనే వున్న హోటల్లో ఒక గది నాన్న వుండటానికి ఇచ్చారు.

నాకు 8 వ నెలలో ఒకే కాన్పులో ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. చాలా తక్కువ బరువుతో పుట్టారు. ఎత్తుకోవాలంటేనే చాలా భయం వేసేది. తరువాత కొన్నాళ్ల వరకూ హాస్పిటల్ లోనే వున్నాను. మా పిల్లలకు పేర్లు పెట్టమని పూజ్యశ్రీ అమ్మగారిని అడిగాను. మా మామగారి పేరు హనుమంతరావుగారు. 'హ' అక్షరంతో పేరు మొదలవ్వాలని మా అత్తగారు చెప్పారు. మా అత్తగారి ఇంటి ఇలవేల్పు శివుడు. దత్తుడు, బాబా అనుగ్రహంతో పుట్టారు కనుక పూజ్యశ్రీ అమ్మగారు పెద్దమ్మాయి పేరు, 'దత్త శివ సాయి హంసిని', చిన్నమ్మాయి పేరు, 'దత్త శివ సాయి హరిణి' అని పెట్టారు. ఆ పేర్లు విని మేమంతా చాలా సంతోషించాము.

మొదటిసారి పిల్లలను తీసుకుని పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి వెళ్ళినప్పుడు, ఒక పాపని చూసి "ఇది హంసిని కదూ?!" అన్నారు! నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే ఇద్దరూ ఒకేలా వుండేవారు. మాకే చాలా తికమకగా వుండేది. అలాంటిది పూజ్యశ్రీ అమ్మగారు అమ్మాయి పేరు చెప్పేసరికి చాలా ఆశ్చర్యపోయాము. మరి ప్రసాదించినవారికి తెలియకుండా ఎలా వుంటుంది? నిజంగా పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు, "మనకేది లేదో దానిని ప్రసాదించే గురువుని పట్టుకున్నాము" అన్న మాట ఎంత అక్షర సత్యమో నిరూపించారు. ఏం చేసినా వారి ఋణం తీర్చుకోలేము. ఇప్పుడు పిల్లలు ఇంటర్మీడియేట్ చదువుతున్నారు.

సమాధి అనంతరం కూడా పూజ్యశ్రీ అమ్మగారు నాకు ఒక అద్భుతమైన లీల చేశారు. రెండు నెలల క్రితం నాకు ఒళ్ళంతా విపరీతమైన దురదలు వచ్చాయి. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. చివరికి వైద్య పరీక్షల కోసం చెన్నై కూడా వెళ్ళాము. అయినా లాభం లేకపోయింది. తిరిగి వచ్చాక ఒకరోజున బాధ భరించలేక, పూజ్యశ్రీ అమ్మగారి పటానికి నమస్కారం చేసుకుని, "అమ్మా! ఈ బాధ తగ్గితే గుమ్మళంపాడు వచ్చి ఒకరోజు నిద్ర చేస్తాను" అని మొక్కుకున్నాను. చిత్రంగా మర్నాటికి కొంచెం బాధ తగ్గింది. 2022 సం. శ్రావణ మాసంలో ఒకరోజు గుమ్మళంపాడులో నిద్ర చేశాను. నాతోపాటు మా అక్క కూడా వచ్చింది. మేము, 'మనకు అమ్మ, నాన్న లేరు కదా! ఇప్పుడు పుట్టింటికి వచ్చినట్లు వుంది కదా! ' అనుకున్నాము. చాలా సంతోషంగా, ప్రశాంతంగా అనిపించింది. మర్నాడు మధ్యాహ్నం ప్రసాదం తీసుకుని బయలుదేరాము. అక్కడనుంచి వచ్చాక నాకు దురదలు పూర్తిగా తగ్గిపోయాయి.

పూజ్యశ్రీ అమ్మగారినుంచి నేను పొందినది మాతృప్రేమ, నిజం చెప్పాలంటే, అంతకుమించిన ప్రేమ!! మా అమ్మ నన్ను ప్రేమిస్తుంది కానీ, అమ్మని చెయ్యలేదు. అంతటి అర్హత నాకు ప్రసాదించి, నా జీవితంలో ప్రతి పరిస్థితిలో నాకు తోడై నా వెంటవుండి నడిపిస్తున్న కరుణామయి పూజ్యశ్రీ అమ్మగారికి కృతజ్ఞతా పూర్వక పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

ఓం సంతానలక్ష్మై నమః!

జై సాయి మాస్టర్!!

# గురుస్మరణయే తన ఊపిరిగా –

# మాతృశ్రీ అలివేలు మంగమ్మ జీవన గమనం

**శ్రీమతి శ్రీదేవి**

మహాత్ముల జీవితాలు అగాధసాగరాలు. అంతు తెలియని ఆ అగాధ సాగరాలను తరచి చూస్తే ఆ లోతులలో దాగి వున్న యెన్నెన్నో విలువైన మణి మాణిక్యాలను మనం దర్శించగలము. అదే విధంగా మహాత్ముల జీవిత గమనాలను మనం జాగ్రత్తగా శోధించి చూడగలిగితే వారిలోని యెన్నో అపూర్వ దివ్యగుణాలను మనం దర్శించ గలుగుతాము. అవి మనకు యెన్నో ఆధ్యాత్మిక తత్త్వాలను, జీవిత సత్యాలను బోధిస్తూ మనకు ఆదర్శప్రాయములై మనలను నడిపించటం జరుగుతుంది.

మహాత్ములు భూమిపై అవతరించిన సందర్భాలలో వారి జీవితాలు సామాన్యులవలె కాక విలక్షణరీతిలో సాగుతుండటం మనం చూస్తుంటాము. కొందరు బ్రహ్మచారులుగా, కొందరు గృహస్థులుగా, కొందరు సన్యాసులుగా, మరికొందరు పీఠాధిపతులుగా వుంటూ జనులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ వారి శ్రేయస్సుకై నిరంతర కృషి చేస్తూవుంటారు. మహాత్మురాండ్రుగా ప్రసిద్ధి చెందిన స్త్రీలు కూడా యిదే విధంగా కొందరు గృహిణిలుగా, కొందరు బ్రహ్మచారిణులుగా, సన్యాసినులుగా జీవనం సాగిస్తారు. ఇలా యోగినులై సద్గురువులుగా వెలసిన జిల్లెళ్ళమూడి అమ్మ, చివటం అమ్మ, శ్రీ ఆనందమయి మాతల వలెనే మన శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్ని మాతృశ్రీ అలివేలు మంగమ్మ తల్లి కూడా గృహస్థ జీవితాన్నే యెన్నుకున్నారు.

అందరు మహాత్ముల వలె శ్రీ అలివేలు మంగామాత కూడా ధర్మాచరణకు అత్యంత ప్రాధాన్యత నిచ్చేవారు. గృహస్థాశ్రమ ధర్మాలను తాను తు. చ. తప్పక పాటిస్తూ, భక్తులకు కూడా 'ధర్మాచరణయే మనిషిని దైవానికి చేరువ చేయగలదు' అని చెప్పేవారు.

జిల్లెళ్ళమూడికి ఆమె తన 16వ సంవత్సరంలో మాతృశ్రీ అనసూయమ్మగారి దర్శనార్థం వెళ్ళటం జరిగింది. అప్పటివరకు ఆమె తన బాల్యంలో గడిపిన జీవితం కూడా యెంతో ఆశ్చర్యంగా, అద్భుతంగా అనిపిస్తుంది. అంత చిన్న వయస్సులోనే ఆమె తన కుటుంబం గురించిన కష్టసుఖాలను యెంతో బాధ్యతతో ఆలోచించేవారు. ఆమె తన తల్లిదండ్రులకు నాలుగవ కుమార్తెగా జన్మించినప్పటికీ పెద్ద కుమార్తెవలె కుటుంబ సభ్యుల సమస్యలను గురించి ఆలోచించేవారు. పనిపాటలలో తల్లికి సహాయపడేవారు. తాను S.S.L.C. పాసైన వెంటనే టీచర్ ట్రైనింగ్ చదివి ఉద్యోగంలో చేరి ఆర్థికంగా తండ్రికి సహాయపడాలని తపించేవారు. ఇలా కుటుంబంలోని ఒక పెద్ద కొడుకువలె కుటుంబాన్ని ఆదుకొనడం తన కర్తవ్యంగా తలచేవారు. ఒకవైపు భక్తిభావనలతో నిండిన ఆమె మనస్సు యింటిని గురించిన తన బాధ్యతను యేమరక అన్ని విధాలా తన కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా పాటించటమనేది అంత చిన్న వయస్సులో ఆమెకే సాధ్యం అనిపిస్తుంది.

అలాంటి సమయంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించినప్పుడు ఆమెలో అప్పటివరకు వున్న ఆలోచనలు, ఆకాంక్షలు అన్నీ ఒక్కసారిగా జిల్లెళ్ళమూడి అమ్మ దర్శనంతో పూర్తిగా అదృశ్యమైపోయాయి. ఆనాటి నుండి ఆమె జీవితం 'తన సర్వస్వం జిల్లెళ్ళమూడి అమ్మే' అన్న ఒకే ఒక్క భావనతో మమేకమైపోయింది.

జిల్లెళ్ళమూడిలో ఆమె ఒక ఋషికన్య వలె జీవించారు.

అంతకు ముందువరకు చక్కగా తల దువ్వుకుని, బొట్టు, కాటుక పెట్టుకుని వుతికి ఆరవేసిన బట్టలను కూడా యిస్త్రీ చేసిన బట్టలవలె శుభ్రంగా కొంచెం కూడా నలిగిపోకుండా యెంతో పొందికగా ధరించేవారు. ఆమె ధరించే బట్టలు యెన్నాళ్ళైనా చిరిగిపోయేవే కాదు. అటువంటి ఆమె జిల్లెళ్ళమూడి వెళ్లిన నాటినుండి మరో మనిషిలాగా మారిపోయారు. తన శరీరం గురించి, బట్టల గురించి యేమాత్రం దృష్టి వుండేది కాదు. సరిగా తల దువ్వుకొనక, తైల సంస్కారం లేక నల్లని జుట్టు యెర్రగా మారిపోయినా, శరీరం శుష్కించి పోయినా - ఆమెకు అవేవీ పట్టేవే కాదు. నిరంతర సేవ, నిరంతర నామస్మరణ — యీ రెండు విషయాలే తన జీవిత లక్ష్యాలుగా ఆమె యొక్క జిల్లెళ్ళమూడి జీవితం కొనసాగింది.

అలా 16 సంవత్సరాల బాలికగా జిల్లెళ్ళమూడిలో అడుగుపెట్టి సుమారు ఆరు సంవత్సరాల పాటు జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో, సేవలో గడిపిన అలివేలుమంగామాత తపస్సు ఫలించిన పార్వతీదేవి వలె శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్నిగా గృహస్థ జీవితంలోకి అడుగుపెట్టారు.

గమ్యం చేరిన బాటసారి వలె, అంతటితో ఆమె జన్మ సార్థకమై పరిపూర్ణతను సంతరించుకున్నది. ఆ పరిపూర్ణతలో యెంతో కొత్తదనం, మాధుర్యం నింపుకున్న ఆమె జీవితం, తదుపరి ప్రయాణమంతా నిరంతర గురుస్మరణలో పునీతమై సాగిపోయింది.

ఇక్కడ నేను చెప్పదలుచుకున్న ప్రధానమైన విషయం ఒకటే! అదేమిటంటే - బాహ్యంగా ఆమె జీవితము చూపరులకు యెలా అనిపించినప్పటికీ, చూసేవారి దృష్టికోణాల నుండి యేవిధంగా కనిపించినప్పటికీ, ఆమె ఆంతర్యం తన పతిదేవులు, సద్గురువు అయిన శ్రీ భరద్వాజ మాస్టరుగారి స్మరణతోనే సదా నిండివుండేది - అనే విషయాన్నే నేనిక్కడ చెప్పదలిచానని తెలియజేసుకుంటున్నాను. ఆమె మనస్సు - పుష్పం చుట్టూ పరిభ్రమించే తుమ్మెద వలె - శ్రీ గురుదేవుల గురించిన ఆలోచనలతోనూ, ఆమె శరీరం వారి సేవలోనూ ప్రతిక్షణమూ నిమగ్నమై వుండేవి. ఆమె మాట్లాడే మాటలన్నీ శ్రీ మాస్టరుగారి గురించే సాగుతుండేవి.

శ్రీ మాస్టరుగారి గురించిన ఆలోచనలతో ఆమె ఎంతగా లీనమైపోయి వుండేవారంటే ఆయన యొక్క



ప్రతి చర్యను, ప్రతి మాటను, ఆ చర్యలోని ఆ మాటలలోని నిగూఢార్థాలను ఆధ్యాత్మిక సందేశాలను అర్థం చేసుకొని తన ఆచరణలో చూపేవారు. ఎల్లప్పుడూ ప్రతివారికి ఆయన బోధనలనే వివరిస్తూ - అలా ఆయన స్మరణలో ఆమె అనిర్వచనీయమైన ఆత్మానుభూతిని పొందుతుండేవారు.

ఆమె శ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి చెప్పే విషయాలు ఎంతో అద్భుతంగా, ఆనందంగా వుంటూ వినేవారి మనసులను ఒక అలౌకిక లోకంలోకి తీసుకొని వెళ్తుండేవి. అందరూ ఆమె చెప్పే మాటలు మైమరచి వింటుండేవారు.

ఆమె తన గురుదేవులు శ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి యిలా చెప్పేవారు :

“మహాత్ములందరూ జనులను వుద్ధరించేందుకే అవతరిస్తారు. వారు యెల్లప్పుడూ ఆత్మానందంలో తేలియాడుతుంటారు. వారి స్వభావము, నడవడిక, బోధనా విధానము ఒక్కొక్కరిది ఒక్కొక్క విధంగా కనిపిస్తుంది. అయితే శ్రీ భరద్వాజగారి విధానం మరింత విలక్షణంగా కనిపిస్తుంది. ఆయన ఒక సాధారణ వ్యక్తి వలె చూపరులకు కనిపించే ఒక అసాధారణ దివ్య పురుషుడు. ఆయన ఒక

కళాశాల ఉపాధ్యాయుడిగా వుంటూకూడా అతి సామాన్య వేషధారణలో విలాసవంతమైన జీవితానికి దూరంగా యెంతో నిరాడంబరంగా జీవించారు. అయినప్పటికీ తన దివ్యబోధలతో నిరంతరము మనుషుల మనసులను పవిత్రజీవితం వైపు మరలించగల అద్భుత శక్తిసంపన్నులై వుండేవారు. సమర్థ సద్గురుడై ప్రజలను భక్తిసాగరంలో ఓలలాడిస్తూ వుండేవారు."

శ్రీ అమ్మగారు మాస్టరుగారి గురించి యింకా యిలా చెప్పేవారు: "పూజ్యశ్రీ మాస్టరుగారిని భౌతికంగా దర్శించక ముందువరకు మనుషులు ఆయన గురించి వేరే విధంగా వూహించుకొనేవారు. ఆయన యెల్లప్పుడూ ధ్యాననిష్ఠులై వుంటారని, వచ్చిన భక్తులకు ఆధ్యాత్మిక బోధలను మాత్రమే చేస్తూ వుంటారని అనుకునేవారు. అయితే ఆయన జీవన విధానం ఎంతో విశిష్టంగా, అద్భుతంగా వుంటూ మరి యే మహాత్ములు ఆయనతో పోలరన్న సత్యం ఆయనను ప్రత్యక్షంగా చూసినవారికి మాత్రమే అర్థమవుతుంది."

"ఆయన ప్రతిరోజు ఉదయ హారతి చేసేవారు. హారతి సమయంలో భక్తులతో కలిసి హారతి గీతాలు పాడేవారు. ద్వారక, వేదవతిలను దగ్గర కూర్చోబెట్టుకుని చదివించేవారు. వచ్చిన భక్తుల సమస్యలు విని పరిష్కారాలు చెప్పేవారు. శ్రీ సాయి లీలలు నిరంతరం భక్తులకు బోధించేవారు. కాలేజీ విద్యార్థులకు ఆధ్యాత్మికతను సైన్స్ తో కలిపి బోధించేవారు. ఎన్నెన్నో పుస్తకాలు చదువుతుండేవారు. భక్తుల ఆహ్వానం మేరకు సత్సంగాలకు, శుభకార్యాలకు వెళ్లేవారు."

శ్రీ అలివేలుమంగా మాత శ్రీ భరద్వాజ మాస్టరుగారికి భక్తులపై గల అపారమైన ప్రేమను గురించి చెబుతూ ఒకసారి భక్తులతో యిలా అన్నారు—

"మహాత్ములను ఆశ్రయించిన భక్తులు వారి పట్ల తమకు గల అపారవిశ్వాసము, కృతజ్ఞత, ప్రేమలను వ్యక్తపరచుకొనటానికై తమ గురువుల జన్మదిన వేడుకలలో, గురుపూర్ణిమ వంటి పర్వదినాలలో తమ గురుదేవులను పూజించుకుంటూ ఎంతో ఆనందాన్ని పొందుతుంటారు. అయితే మనము వారిని యీ విధంగా గౌరవించుకొనటంతోనే మన బాధ్యత తీరిపోతుందా? అలా అనుకుంటే అది మన అజ్ఞానమే. సద్గురువైన శ్రీ భరద్వాజ మాస్టరుగారి జీవితం పరిశీలిస్తే ఆయన యెందరో వ్యక్తులకు, యెన్నో కుటుంబాలకు మాత్రమే కాదు యావత్ ప్రపంచానికే యెంతటి మేలు చేశారో కొలిచేందుకు కొలబద్దలే లేవు. అలా ఆయన చేస్తున్న మేలుకు ప్రతిగా మనం ఆయనకు పూజలు చేస్తే ఆయన సంతోషిస్తారన్నది మన భ్రమ మాత్రమే. మనం యేమి చేస్తే ఆయన సంతోషిస్తారన్న విషయాన్ని మనం గుర్తించి ఆచరించాలి. ఎటువంటి యెంతటి మహాత్ముడైనా తనకు చేసే యిటువంటి పూజలు వలన సంతృప్తి చెందరు. మనం యేమి చేస్తే వారు ఆనందిస్తారో మనం గుర్తించడం అవసరం. శ్రీ భరద్వాజ మాస్టరుగారు బోధించిన జ్ఞానమార్గంలో, భక్తిమార్గంలో మనం నడవగలిగినప్పుడే వారిని మనం సంతోష పెట్టగలం. కానీ మనమిచ్చే కానుకలు, మనం చేసే పూజలు ఆయనకు సంతోషం కలిగించవు. సృష్టికర్త అయిన శ్రీ దత్తాత్రేయులే శ్రీ భరద్వాజ మాస్టర్ గా అవతరించారన్నది పరమ సత్యం. అందరికీ అన్నింటిని ప్రసాదించే ఆయనకు మనము యేమి యివ్వగలము? కనుక ఆయన చెప్పిన ధర్మమార్గంలో, ఆధ్యాత్మికమార్గంలో నడిచి మన జన్మ సార్థకం చేసుకున్నప్పుడే శ్రీ మాస్టరుగారు సంతోషిస్తారు తప్ప బాహ్యపూజల వలన కాదు. దీని అర్థం మనం చేసే పూజలు, వేడుకలు ఆయన యిష్టపడరని కాదు. మన సేవలని ఆయన మన సంతోషం కోసం తప్పకుండా స్వీకరిస్తారు. కానీ, యే తండ్రి అయినా తన కుమారుడు యెల్లప్పుడూ తనను పొగుడుతూ సేవలందిస్తూ వున్నంత మాత్రాన సంతృప్తి చెందగలడా? తన కుమారుడు ప్రయోజకుడు అయినప్పుడే, అతడు సత్ప్రవర్తనతో జీవిస్తున్నప్పుడే తండ్రికి సంతోషం కలుగుతుంది."

శ్రీ అలివేలుమంగా మాత నిత్యజీవితంలో అందరూ ధర్మబద్ధంగా యెలా జీవించాలో తన సరళమైన మాటలలో భక్తులకు చక్కగా బోధించేవారు. భార్యాభర్తలు ఒకరి పట్ల ఒకరు ప్రవర్తించవలసిన తీరుతెన్నులు, పిల్లలపట్ల వ్యవహరించవలసిన విధానం, ఇంటి పనులు చేసేటప్పుడు యెలాంటి భావంతో చేయాలి — యిటువంటి నిత్యజీవితంలో స్త్రీ పురుషులు ఆచరించవలసిన విధానాలను తెలియపరచేవారు. పూజ, పారాయణ, జపధ్యానాలు, దైవ నివేదన, భిక్ష సమర్పణ — వీటన్నింటినీ యెటువంటి భావం మనసులో నింపుకుంటూ చేయాలి అనే విషయం వివరించి చెప్పేవారు.

నేటి కాలంలో పిల్లల పట్ల తల్లిదండ్రుల ప్రవర్తించే విధానం పట్ల అమ్మగారు చాలా ఆవేదన చెందేవారు. పిల్లలు బాగా చదువుకొని పెద్దపెద్ద ఉద్యోగాలు చేయాలి

అన్న తపనతో వారి లేత శరీరాలను, మనస్సులను క్షోభకు గురిచేయటం సరికాదనేవారు. హాయిగా తల్లి ఒడిలోనూ కుటుంబ సభ్యుల మధ్యా యెంతో గారాబంగా పెరగవలసిన పసిపిల్లలను 3,4 సంవత్సరాల వయస్సులోనే స్కూలుకు పంపడం యెంతో దారుణం అనేవారు. ఆ పసిపిల్లలను హాయిగా వారికి తగినంత సమయం నిద్ర కూడా పోనివ్వకుండా టైము కు స్కూలుకు పంపాలన్న తొందరలో బాగా ఉదయాన్నే వారిని బలవంతంగా నిద్రలేపి, పళ్ళు తోమి, స్నానం చేయించి, ముస్తాబు చేసి వాళ్లకు తినాలని లేకున్నా బలవంతంగా ఆహారం తినిపించి త్వర త్వరగా స్కూలుకు పంపివేయటం చూస్తున్నాము. ఇలా చేయడం వలన వారికి భోజనం పైన, చదువు పైన కూడా అయిష్టత యేర్పడుతుంది. వారు క్రమంగా తల్లిదండ్రులను, టీచర్లను చివరకు సమాజాన్ని కూడా ద్వేషించడం మొదలుపెడతారు – అంటూ శ్రీ మాస్టరుగారు చెప్పిన విద్యావిధానాలను అమలు పరచవలసిన ఆవశ్యకత మన సమాజానికి యెంతైనా వున్నదని చెప్పేవారు శ్రీ అమ్మగారు.

ఒకసారి అమ్మగారు తీర్థయాత్రల గురించి యిలా చెప్పారు: దాదాపు ప్రతివారు తీర్థయాత్రలు చేస్తూనే వుంటారు. అయితే నేటి కాలంలో తీర్థయాత్రలు చాలా విలాసవంతముగా చూస్తున్నాము. యాత్రికుల ఆర్థిక స్తోమతను బట్టి ఆధునిక ప్రయాణ సౌకర్యాలు, వసతి సౌకర్యాలు, భోజన సదుపాయాలు పుష్కలంగా సమకూరుతున్నాయి. అందువలన యేమాత్రం కష్టం లేకుండా యెంతో సుఖంగా ఒక సరదా టూర్ కి వెళుతున్నట్లుగా యాత్రికుల వైఖరి వుంటున్నది కానీ దైవదర్శనానికి వెళ్లేటప్పుడు వుండవలసిన భక్తి భావనలు వారిలో మచ్చుకైనా కనిపించడం లేదు. అయితే పూర్వం యిటువంటి సౌకర్యాలు యేమీ వుండేవి కావు. ఎంతో కష్టపడి కొండలు, కోనలు దాటుకుంటూ ఒక్కొక్కసారి యెన్నో మైళ్ళు కేవలం కాలినడక తోనే క్షేత్రం చేరుకునేవారు. ఈ ప్రయాణాన్ని సాధక బాధకాలను సహిస్తూ శ్రమను ఓర్చుకుంటూ సాగించేవారు. దైవ దర్శనం కోసం యెంతటి బాధలైనా సహించటానికి సిద్ధపడేవారు. అదీ నిజమైన తీర్థయాత్ర అంటే!!

ఈ విధంగా శ్రీ అలివేలు మంగమ్మగారు అనేక విషయాలు వివరిస్తూ నిరంతరం భక్తులలో సత్ప్రవర్తన కలిగించేటందుకు అవసరమైన అవగాహనను తన బోధల ద్వారా అందించేవారు.

మాతృశ్రీ అమ్మగారు శ్రీ మాస్టరుగారి గురించి చెపుతూ “ఆయన సాయితత్వాన్ని యెంతో చక్కగా ప్రజలకు వివరించారని; విదేశీ పాలన, స్వతంత్ర పోరాటం, మత కలహాలతో దేశం అస్తవ్యస్తమైన సమయంలో సాయినాథుడు అవతరించారని; మతసామరస్యం నెలకొల్పి ప్రజలలో దైవచింతనను మేలుకొలిపారని – శ్రీ మాస్టరుగారు సాయినాథుని అవతరణ ఆవశ్యకతను తెలియజేశారు” అన్నారు. సాయినాథుని నిగూఢ చర్యలను ఆయన యొక్క వినూత్న బోధనా విధానాలను గురించి శ్రీ మాస్టరుగారు శ్రీ సాయి ప్రబోధామృతంలో యెంత అర్థవంతంగా వివరించారో శ్రీ అమ్మగారు తెలియజెప్పేవారు. శ్రీ సాయి లీలలలోని గూఢార్థాలను శ్రీ మాస్టరుగారి వలె మరొకరు యెవ్వరూ వివరించలేరని, శ్రీ మాస్టరుగారి బోధనా విధానాల విలక్షణతను గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పేవారు శ్రీ అమ్మగారు.

అసలు ఆధ్యాత్మికత అంటే యేమిటి? అనే విషయాన్ని శ్రీ మాస్టరుగారి వలె అంత చక్కగా యెవరూ విశదీకరించలేరని కొనియాడేవారు. అంతటి బ్రహ్మజ్ఞాని అయిన శ్రీ మాస్టరుగారు యెల్లప్పుడూ ‘అంతా సాయి దయ!’ అంటూ నిరంతరం సాయినాథుని కొనియాడుతూ సాయినాథునిలో మమేకమై జీవిస్తూ కూడా అవిశ్రాంతంగా జనుల ఆత్మోన్నతికి కృషి చేశారని శ్రీ అమ్మగారు అనేవారు.

ఈ విధంగా చెప్పుకుంటూ పోతే మన దివ్యజనని శ్రీ అలివేలు మంగమ్మ శ్రీ భరద్వాజ మాస్టరుగారి తత్వాన్ని, బోధనలను నిరంతరం వివరిస్తూ భక్తులలోని భక్తి భావనలను జాగృతం చేయ కృషిచేశారు. ఈ విధంగా తమ యింటికి వచ్చే భక్తులను ధర్మాచరణ పట్ల అప్రమత్తులను చేస్తుండేవారు. అయినప్పటికీ ఆమె హృదయం నిరంతరం సద్గురు శ్రీ భరద్వాజ దేముని చరణాలకే అంకితమై నిలిచివుండేది. ఆమె ప్రతిశ్వాసలోనూ ఆ స్వామి యొక్క దివ్యనామమే ప్రతిధ్వనిస్తూ, ఆమె సన్నిధియే ఒక దేవాలయంవలె విరాజిల్లుతుండేది. అటువంటి మహాత్మురాలు, మహనీయురాలు మన దివ్యజనని శ్రీ అలివేలుమంగమ్మ దివ్యచరణాలకు ప్రణామాలర్పించి ధన్యులమౌదాము.

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 13వ ప్రసంగము

### శమము

శంకరాచార్యులవారు శమము గురించి వ్యాఖ్యానిస్తూ ***సదైవ వాసనా త్యాగః శమోఽయమతి శబ్దితః*** నిరంతరము వాసనలను త్యజించడం శమము అని చెప్పబడుతుంది. దృఢభావంతో ముందువెనకలు ఆలోచించకుండా, ఇవి మంచివి, ఇవి నిషిద్ధమైనవి అనే భేదాన్ని పాటించకుండా వస్తువులను (విషయాలను) గ్రహించడం 'వాసన' అనబడుతుంది.

ఆ వాసన రెండురకాలు 1) శుభవాసన 2) అశుభవాసన.

అశుభవాసన మానవుని బంధించడానికి కారణము. శుభవాసన ముక్తికి ద్వారము. అశుభ వాసనలనన్నింటినీ త్యజించడం శమము.

యోగవాశిష్ఠంలో ఇలా చెప్పబడివుంది–

***శ్లో॥ మానసీ వాసనాః పూర్వం త్యక్త్వా విషయ వాసనా I***
***మైత్ర్యాది వాసనా రామ గృహాణామల వాసనాః II***

భావం : ఓ రామ! మానస (మనసులోని) వాసనలను, విషయవాసనలను త్యజించు. మైత్ర్యాదులు (మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష)** – ఈ నాలుగు వాసనలను గ్రహించు.

**మైత్రి – స్నేహపూర్వకమైన/ ప్రేమ పూర్వకమైన కరుణ – జాలి, దయ, కరుణ.
ముదిత – ఆనందం ; ఉపేక్ష – సమానత్వం

## శబ్దాది విషయాలను అనుభవించే పద్ధతులు

శబ్దము మొదలైన విషయాలను రెండు రకాలుగా అనుభవించవచ్చు.

1. కామ్యమానత్వము.
2.భుజ్యమానత్వము.

కామ్యమానత్వము అంటే మానసిక వాసనల ద్వారా శబ్దాది విషయాలను అనుభవించాలనే కోరిక. భుజ్యమానత్వము అంటే మానసిక వాసనల పరిణామరూపంలో శబ్దాదులను అనుభవించడం. ఈ రెండింటిని కూడా పరిత్యజించాలి. ముక్కులో దుర్గంధము(చెడువాసన)తో కూడిన పదార్థము వున్నంతవరకు సుగంధము తెలియనట్లుగానే, మలినమైన వాసనలతో చిత్తము నిండివున్నప్పుడు శుభవాసనలు లభించవు. శుభవాసనలు కలుగనంత కాలము ఆత్మసాక్షాత్కారము అసంభవము.

## దమము

*నిగ్రహో బాహ్య వృత్తీనాం దమ ఇత్యభిధీయతే*

బాహ్యవృత్తి నిగ్రహము – అంటే శ్రోతము(చెవి), త్వచము(చర్మము), చక్షువు(కన్ను), జిహ్వ(నాలుక), ఘ్రాణము(ముక్కు) – ఈ ఐదు జ్ఞానేంద్రియాలు; వాక్కు(నాలుక), హస్తము(చేయి), పాదము(కాలు), గుదము(విసర్జన అవయవము), ఉపస్థము(లైంగిక ఇంద్రియము) – ఈ ఐదు కర్మేంద్రియాలను శాస్త్ర నిషిద్ధాలైన కర్మల నుండి ఆపడము, వాటిల్లో ప్రవర్తించకుండా వుండడం దమము.

## దశేంద్రియాలు

ఇంద్రియాలను నిగ్రహించకపోతే విషయాలలో తగుల్కొనే (విషయ ప్రవృత్తములైన) ఇంద్రియాలు ముముక్షువును శ్రేయోమార్గము (మోక్షమార్గము) నుండి క్రిందకు తోసివేస్తాయని మనువు చెప్పాడు.

*శ్లో॥ ఇంద్రియాణామ్ తు సర్వేషాం*
*యదేకం క్షరతీన్ద్రియమ్ ।*
*తేనాస్య క్షరతి ప్రజ్ఞా*
*ధృతేః పాదాదివోదకమ్ ॥*

భావం : ఇంద్రియాలలో ఏ ఒక్కటి నశించినా మానవుని ఆత్మవిషయకమైన బుద్ధి నశిస్తుంది. తోలుసంచీలో చిల్లి పడగానే నీరంతా పోయినట్లు అతని బుద్ధి పోతుంది.

చిల్లు వున్న కుండలో ఎన్నిసార్లు నీరు పోసినా కుండ ఖాళీగా వుంటుంది. శరీరమనే కుండలో పది ఇంద్రియాలనే పది కన్నాలు వుంటాయి. ఆ ఇంద్రియాలను నిగ్రహించకపోతే ఎన్ని శ్రవణము మొ॥న సాధనాలు వున్నా ఆత్మవిషయకమైన బుద్ధి స్థిరంగా వుండదు. చిల్లు వున్న కుండలాగా ఎల్లప్పుడు లోపల ఖాళీగానే వుంటుంది.

## మనసు ఇంద్రియాలకు రాజు

పది ఇంద్రియాలు మనస్సు ఆధీనంలో వుంటాయి. రాజును పట్టుకుంటే ఎలా అయితే సైన్యం అంతా వశమవుతుందో, అలాగే మనస్సును జయిస్తే ఇంద్రియాలన్నీ వశమౌతాయి.

మనుస్మృతి లో ఇలా వున్నది–

*శ్లో॥ ఏకాదశం మనోజ్ఞేయం*
*స్వగుణేనోభయాత్మకమ్ ।*
*యస్మిన్ జితే జితావేతౌ*
*ద్విగుణపంచకౌ గణౌ ॥*

భావం: మనస్సు పదకొండవ ఇంద్రియము. తన గుణాన్ని బట్టి జ్ఞానేంద్రియంగాను కర్మేంద్రియంగాను పనిచేస్తుంది(జ్ఞాన కర్మేంద్రియాత్మకమ్). అది జయంపబడితే ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలూ కూడా జయింపబడతాయి.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# బుద్ధ ధ్యాన హృదయము

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**మనస్సునెరుగుటలో కేవల శ్రద్ధ యొక్క ప్రాశస్త్యము :**

మనము మనస్సులోనే మనస్సు ద్వారానే జయిస్తాము. కాని అది అన్నింటికంటే దుర్గ్రాహ్యము. కేవలశ్రద్ధ ఓర్పుతో మనలో జరిగే మానసిక క్రియలోని ప్రాథమిక అంశాలను ప్రథమంగా గుర్తించడంద్వారా మనస్సు యొక్క నిగూఢతత్వాన్ని మనకెరుకపరచి దానియొక్క దుర్గ్రాహ్యమైన గతిమీద అజమాయిషీ నిస్తుంది. కేవలశ్రద్ధతో ఆరంభించి నిర్దుష్టంగా కొనసాగించబడు స్మృతిసాధన మనస్సును స్వాధీనం చేసుకొని దానిని వికసింపజేసి ముక్తి నొందించటానికి కావలసిన పరిజ్ఞానాన్నిస్తుంది. ఒకసారి మానసికానుభూతిలో కొంతమేరకైనా స్వచ్ఛమైన గుర్తింపు, అవగాహన నెలకొన్నప్పుడు అవి క్రమంగా మనస్సు యొక్క యితర భాగాలకు గూడా వ్యాపిస్తుంది. కారణం అట్టి విజ్ఞానాన్ని అన్వేషించే సాధనాన్ని పరివర్తన చెందిస్తుంది. అన్వేషించే మనస్సే స్వచ్ఛతను, నైశిత్యాన్ని పొందుతుంది.

'అలాంటి స్మృతితో గుర్తించబడిన విషయాలే జ్ఞానాన్ని వృద్ధి చేస్తాయి' అని 'సూత్రనిపాతం' లో బుద్ధుడు చెప్తాడు. సూక్ష్మదర్శిని ద్వారా పరిశోధనపై పరిశీలించబడే వస్తువును శుద్ధం చేసి అన్యపదార్థం నుండి వేరుపరచి సంసిద్ధం చేసి కటకానికి క్రింద కదలకుండా వుంచుతాము. అలానే జ్ఞానదృష్టితో పరిశీలించదలచిన కేవల విషయాన్ని కేవలశ్రద్ధ తదనుగుణంగా సిద్ధం చేస్తుందని గుర్తించాలి. విషయాన్ని నిరాధారమైన మనోభావాలనుండి పరిశుద్ధం చేస్తుంది. జ్ఞానదృష్టి ముందు నిశ్చలంగా వుంచుతుంది. అంటే విషయాన్ని గుర్తించే స్థితిలో మన మనస్సు నెక్కువ కాలం నిల్పుతుంది.

కేవలశ్రద్ధ చేసే యీ పని విషయాన్ని విడమరచి విశ్లేషించి దాని యంశాలను మనకెరుకపరచడమేగాక యితర విషయాలతో దానికి గల సంబంధాన్ని, వాటితో దానికిగల ప్రతిక్రియలను, దానినట్టి గుణాలలో నిలిపే కారణాలను, ఇతర విషయాలను, ఆయా రీతులలో పరిమితం చేసే దాని యొక్క తత్వాన్ని మనకెరుకపరచటమనే సంశ్లేషణ లేక సమన్వయ క్రియలో గూడా ఉపకరిస్తుంది.

కేవలశ్రద్ధ అనే స్థితిలో మనస్సు చాలినంత సేపు నిలువకపోతే యీ అంశాలన్నీ గుర్తింపుకు రావు. వస్తువుల మధ్యగల సంబంధాన్ని సరిగా తెలుసుకోవాలంటే ఆ సంబంధాలను కలిగిన వివిధ వస్తువులయొక్క తత్వాన్ని ఒక్కొక్కటిగా స్పష్టంగా గుర్తిస్తే తప్ప వీలుకాదు (మనస్సు, కన్ను, లక్కపిడత, అందులోని వెన్నముద్ద, చుట్టూ వున్న ఉష్ణోగ్రత, వెలుగు, మెలకువనే స్థితి).

మానవుడు తన అలవాటు ప్రకారం విషయాలను నిరాధారమైన విశేషణాలను పరిమితము, ఆచ్ఛాదితము చేయకుండా సహకరిస్తుంది. గనుక కేవలశ్రద్ధ ద్వారా వస్తువులను నిత్యనూతనంగా మొదటిసారిగా చూచినట్లే చూచేలాగా చేస్తుంది. కనుక విషయాలు అంతకంతకు నూతనమైన తనలోని విషయాలను వ్యక్తం చేస్తూంటాయి. కనుక కేవలశ్రద్ధా స్థితిలో మనస్సునెక్కువసేపు నిలిపినపుడు మానసిక అవగాహన అంతకంతకు విస్తరిస్తుంది. సామాన్య యింద్రియానుభూతి యివ్వలేని ఫలితాన్నిస్తుంది. ఈ విధంగా నిరాధారంగా మనమేర్పరచుకొన్న నిరాధారమైన భావాలు విజ్ఞానమనే జలను మూసివేయకుండ కేవలశ్రద్ధ కాపాడుతుంది.

ఇటువంటి కేవలశ్రద్ధ వల్ల కలిగే ఫలితాలను కొన్నింటిని యిక్కడ ఉదహరిద్దాము:

౧) విషయ గ్రహణము స్థూలంగా ఏకక్రియగా కనిపించినప్పటికీ కేవలశ్రద్ధ ద్వారా వివిధములైన

యింద్రియగ్రహణ క్రియలు అతి త్వరితంగా ఒకదాని వెంట ఒకటి కొనసాగుతూంటాయని తెలుస్తుంది. ఇవి సృష్టియొక్క యదార్థ తత్వాన్ని తెలిపేటందుకు యెంతయో ఉపకరిస్తుంది.

b) సామాన్యమైన యింద్రియ గ్రహణలో కేవల యింద్రియానుభూతి ఒక అంశమని, వాటిని గూర్చి మనము తలచకనే యేర్పరుచుకొనే మనోభావాలు లేక విశేషణాలు రెండవ అంశమని తేలుతుంది. ఈ రెండంశాలను వేరని గుర్తించడం చాలా ప్రయోజనకారి. కారణం ఆ విషయం పట్ల మన ప్రతిక్రియలు మన మనోభావాలపై యెంతో ఆధారపడి వుంటాయి. ఈ విషయాన్ని గుర్తించడం మనస్సు యొక్క తత్వాన్ని నిర్దుష్టం చేయడంలో యెంతో ఉపకరిస్తుంది.

c) కేవలశ్రద్ధ వలన పరిణామము అనే నిత్యసత్యాన్ని మనకు స్పష్టం చేస్తుంది. దీనివలన జీవితం యొక్క, వస్తువుల యొక్క 'అనిశ్చతత్వం' అనే బౌద్ధధర్మం యొక్క ప్రధాన సూత్రాన్ని తెలియబరుస్తుంది. కేవలశ్రద్ధ చేత గుర్తింపబడే సంఘటనలు నిరంతరం ఉద్భవిస్తూ, లయిస్తూ వుండడమనే సత్యమన్న ధ్యానక్రియను పటిష్టం చేస్తుంది. అనుక్షణమూ జరిగే యీ మార్పును మనం అనుభవపూర్వకంగా గుర్తించినపుడు దుఃఖము, అనాత్మ అనే బుద్ధధర్మంలోని తక్కిన రెండంశాలను ఎఱుక పరుస్తుంది.

d) పరిణామమనేది కొంతవఱకు సామాన్య జీవితంలో మనకు తారసిల్లినప్పటికీ సుఖరూపంలోను, దుఃఖరూపంలోను చాలినంత తీవ్రతతో తమకు తారసిల్లితే తప్ప సామాన్యులు దానిని గుర్తించరు. ఈ మార్పు సర్వదా మనతోనే వుండేదేనని, కేవల శ్రద్ధాభ్యాసము మనకు స్పష్టం చేస్తుంది. ప్రతినిముషము అసంఖ్యాకమైన పరిణామాలు మనం గుర్తించలేనంత వేగంగా జరుగుతున్నాయని మనకు తెలియబరుస్తుంది. మనమెటువంటి ప్రపంచంలో నివసిస్తున్నామనే విషయాన్ని కేవలం మానసికంగా కాక మన వ్యక్తిత్వం అంతటిలోను మనం ప్రత్యక్షంగా గుర్తిస్తాము. వచ్చే యీ మార్పులను గుర్తించినపుడు మనము వస్తువులను ఉన్నవి ఉన్నట్లు గుర్తించడమారంభించామన్న మాట (అందులోను ప్రధానంగా మానసిక విషయం). నిరంతర పరిణామమే మనస్సని గుర్తింపౌతుంది. ఈ విధంగా పరిణామమనే మానసిక క్రియను ఆ పరిణామము యొక్క తత్వాన్ని మనకెఱుక పరచటమే కేవలశ్రద్ధ మనకు ప్రసాదించే మనోవిజ్ఞానంలోని ప్రధానాంశము. మన మనస్సు యెప్పుడూ ఒక్కటిగానే యుంటుందని దాని యొక్క లక్షణాలు, దానిచేత గుర్తించబడే వస్తువుల యొక్క లక్షణాలు యెప్పుడు ఒక్కటిగానే వుంటాయనే భ్రాంతిని తొలగించటమే యీ జ్ఞానం యొక్క ప్రయోజనం.

e) ఈ మార్పు యొక్క తత్వావగాహన మానసిక క్రియలు యొక్క తత్వాన్ని మనకెంతగానో తెలియబరుస్తుంది. ఇంద్రియ గ్రహణం మీద కేంద్రీకరింపబడిన కేవలశ్రద్ధ ద్వారా అందులోని మానసిక భౌతిక క్రియల యొక్క తత్వాన్ని, వాటి సంబంధాన్ని, అవి ఒకదాని తరువాత ఒకటి తటస్థించే స్వభావాన్ని, వీటన్నింటినీ క్రోడీకరించి మనస్సు ఒక వస్తువని భావించడాన్ని గూర్చిన అవగాహన కలుగుతుంది.

అయితే యీ వస్తుభావన (objectfying) భౌతిక, మానసిక క్రియలు అన్న పదాలను విశ్లేషణసౌలభ్యం కోసమే వాడడమైనదిగాని విషయము, వ్యక్తి, పదార్థము, మనస్సులాంటి ద్వైత భావాన్నిగాని, మనస్సు మాత్రమే నిజమనిగాని, పదార్థం మాత్రమే నిజమనిగాని చెప్పే అద్వైత భావాన్నిగాని బుద్ధుడు ప్రతిపాదించడం లేదని చెప్పాలి. బుద్ధుడి యొక్క 'ప్రతీత్యాసముత్పాదము' అను సిద్ధాంతము ద్వైత, అద్వైత భావాలకు అతీతము. సాపేక్షికత నిరంతర పరిణామములను తన తత్వంగా గల యీ ప్రపంచంలో కేవలశ్రద్ధ దృష్ట్యా, ద్వైత, అద్వైతాది భావాలు అనుచితాలని తెలియగలదు.

f) కేవలశ్రద్ధ సాధన ద్వారా మానసిక సంఘటనల విషయంలో మన అనుభవం విశాలము, గంభీరము అయినప్పుడు సాధకునికి మనస్సు గుర్తించుట అనే క్రియ తప్ప వేరేమి కాదని ప్రత్యక్షానుభవమౌతుంది. దానిలోగాని, దాని వెనుకగాని ఎక్కడా స్థిరమూ, వాస్తవమూ అయిన వ్యక్తిత్వమే లేదని రూఢి అవుతుంది. ఈ విధంగా అనాత్మ అనే మహత్తర సత్యం అనుభవగతమౌతుంది. అంటే తత్వతః అనుభవించే వ్యక్తి అనుభవింపబడే వస్తువు అనేవేవీ లేవని తెలుస్తుంది.

g) కేవలశ్రద్ధ మన మనస్సు పనిచేసే రీతుల గురించి గూడ యెంతో పరిజ్ఞానాన్ని మనకు లభింపజేస్తుంది. ఉద్రేకాలు, ఆవేశాలు యెలా పనిచేస్తాయో, మనలోని నిజమైన ఉద్దేశ్యాలు పైకి కనుపించే ఉద్దేశ్యాలకు గల భేదం, మన సామాన్య వివేచనా పద్ధతి యెంత అసమగ్రమో మనకు తెలుస్తుంది. మనలోని బలహీనతలు, సామర్థ్యాల యదార్థ స్థితి కూడా తెలుస్తుంది. మనకంతకు ముందు తెలియని సామర్థ్య, అసామర్థ్యాలు మనకవగత మౌతాయి.

*మిగతా 22వ పేజీలో*

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

మహాపండితులైన శ్రీ అనంతాచార్య ఎన్నెన్నో మహాగ్రంథాలను ఆంగ్లంలో రచించారు. వీరు మొట్టమొదటగా రచించిన 'Vision of Aryan Glory' (ఆర్యవైభవ దర్శనం) అనే గ్రంథం విశ్వవిఖ్యాతి గాంచింది. ఈ గ్రంథం హేంబర్గ్ విశ్వవిద్యాలయంలో ఇండాలజీ శాఖలో వరుసగా 3 సం॥లు పాఠ్యగ్రంథంగా స్వీకరించబడింది.

2. Aryan Dharma (ఆర్యధర్మం)

3. Rasayana & Ayurveda (రసాయనం & ఆయుర్వేదం)

4. Suparna

5. Vedam – Ayurvedam (వేదం – ఆయుర్వేదం)

6. The Science of Consciousness

7. The Culture of Agriculture

పై గ్రంథాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో స్వీకరింపబడి ప్రశంసింపబడ్డాయి.

అయితే ఆయనచే రచింపబడిన అముద్రిత గ్రంథాలెన్నో వెలుగు చూడక పోవటం మానవజాతి దురదృష్టమే. వాటిలో కొన్ని :

1) Agni

2) The Vedic Devas

3) Essays on Mahabharatha

4) Essays on Ayurveda

5) The Cosmic Gods

6) The Concept of Waters

7) The Depths of Science.

సమాజసేవ కోసం, కుటుంబ పోషణ కోసం వీరు ఆయుర్వేద వైద్యవృత్తిని చేపట్టారు. విజయవాడ గాంధీనగర్లో 'ఆయుర్వేద రసాయన కుటి' అనే వైద్యాలయాన్ని నెలకొల్పి, తమ వైద్యవిద్యా నైపుణ్యంతో పాటు తమలోని దైవశక్తినీ, తపశ్శక్తినీ మిళితం చేసి ఎన్నెన్నో భయంకర వ్యాధులతో బాధపడే రోగులనెందరినో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసి పంపేవారు.

శ్రీ అనంతాచార్య తమ స్వంత వైద్యాలయంలోనే కాక, తెనాలి, గుంటూరు, బాపట్ల, నెల్లూరు మొదలైన పట్టణాలకు స్వయంగా వెళ్ళి వైద్య సేవలందించేవారు.

వీరి వైద్యవిధానం ఎంతో విలక్షణంగా వుండేది. రోగి వైద్యం కోసం వీరి వద్దకు వచ్చినప్పుడు అతడు ఏమీ చెప్పకముందే అతనిని చూస్తూనే అతడికి వచ్చిన వ్యాధి ఏమిటో శ్రీ అనంతాచార్యగారికి స్ఫురించేది. వ్యాధి నివారణ కోసం ఒక్కొక్కసారి ఆయన రోగికి ఏ రకమైన ఔషధాన్నీ వాడేవారు కాదు. అతడు తీవ్ర జ్వరంలో వున్నప్పటికీ, అభ్యంగన స్నానం చేయించి, నేయి, పెరుగుతో సహా తృప్తిగా భుజింప జేసి గానుగ చెట్టు క్రింద కూర్చోబెట్టేవారు. అంతటి తీవ్ర జ్వరము మరుసటి రోజుకల్లా తగ్గిపోయేది. అతి భయంకరమైన క్యాన్సర్, కుష్టువంటి వ్యాధుల్ని కూడా వీరు తమ అపూర్వ వైద్యవిధానం ద్వారా నివారించేవారు.

వారు ఆయుర్వేదంలో ఒక ఫార్ములాను కనిపెట్టి ఆ ఔషధం ద్వారా ప్రజలను అనేకానేక వ్యాధులనుండి విముక్తి కలిగించి, ఆరోగ్యవంతులుగా చేశారు. ఆ ఔషధం పేరే 'ఓజని'. ఈ ఓజని వైద్య చరిత్రలోనే కనీవినీ ఎరుగని అద్భుతమైన ప్రయోగంగా దేశవ్యాప్తంగా గుర్తింపబడింది. ఆ ఔషధం ద్వారా ఎటువంటి తీవ్రవ్యాధులైనా నివారింపబడటం ప్రత్యక్షంగా చూస్తున్న వైద్య ప్రపంచం ఎలాగైనా ఆ ఫార్ములాను తెలుసుకోవాలని ఆరాటపడింది. బొంబాయి, ఢిల్లీవంటి పెద్ద

పెద్ద నగరాలేకాక, సింగపూర్ వంటి విదేశాలనుండీ కూడా వ్యాపారస్తులు ఆ ఫార్ములా కోసం శ్రీ అనంతాచార్యగారి వద్దకు వచ్చారు. లక్షలు, కోట్లు వెచ్చించి అయినా ఆయన నుండి 'ఓజని' ఫార్ములాను కొనటానికి సిద్ధపడ్డారు. కానీ శ్రీ అనంతాచార్య ధనాన్ని ఆశించి 'ఓజని' ని ఎవరికీ ధారాదత్తం చేయలేదు.

నిజం చెప్పాలంటే శ్రీ అనంతాచార్య రోగుల వ్యాధులను ఔషధాలతో నివారించే వారనటం కంటే ఔషధాలను నిమిత్త మాత్రంగా చేసుకొని పూర్తిగా తమ తపశ్శక్తితో రోగులను ఆరోగ్యవంతులుగా చేసేవారనటమే సముచితం అనిపిస్తుంది. ఈ విషయం సత్యమని ధృవపరచే ఉదాహరణలు ఎన్నో!

ఒకసారి శ్రీ అనంతాచార్యులవారు యింట్లో లేని సమయంలో ఆయన భార్య వున్నట్లుండి కళ్ళు తిరిగి పడిపోయి వెంటనే స్పృహ కోల్పోయారు. ఇంట్లోని వాళ్ళు వెంటనే సమీపంలోని డాక్టరును పిలుచుకు వచ్చారు. అదే సమయంలో శ్రీ అనంతాచార్యకు యింటివద్ద భార్య విపత్కర పరిస్థితిలో వున్నట్లుగా స్ఫురించి, యింటికి వచ్చేసరికి యింట్లో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా వుంది. కొద్ది క్షణాలు గడిచిన తర్వాత డాక్టరుగారు అనంతాచార్యులవారి చేతులు పట్టుకుని ఎంతో బాధతో, "ఆచార్యులుగారు! అయామ్ వెరీ సారీ! మీ శ్రీమతిని నేను కాపాడలేకపోయాను. ఆమె చనిపోయారు!" అంటూ వెళ్ళిపోయారు. శ్రీ అనంతాచార్యులవారు వెంటనే అన్యమనస్కంగా ప్రక్కనే అల్మరాలో వున్న గూటిలో చేయిపెట్టారు. అక్కడ వున్న ఒక శొంఠి కొమ్ము ఆయన చేతికి తగిలింది. వెంటనే ఆయన ఆ శొంఠి కొమ్మును అరగదీసి ఆ శొంఠి గంధాన్ని ఆమె రెండు కళ్ళల్లో పెట్టారు. అయిదు నిముషాలలో ఆమె కళ్ళు తెరచి లేచి కూర్చున్నారు. కొద్దిసేపట్లోనే ఆమె ఏమీ జరగనట్లు లేచి తిరుగసాగారు. చనిపోయిందనుకున్న ఆమె లేచి తిరుగుతూ మామూలుగా యింటి పనులన్నీ చేసుకుంటుండటం చూసిన వారంతా దిగ్భ్రాంతులైనారు. ఆ మరుసటి రోజు శ్రీ అనంతాచార్యగారికి ముందురోజు తమ యింటికి వచ్చిన డాక్టరుగారు బజారులో కనిపించి, ఆయనను ఓదార్చసాగారు. అందుకు ఆచార్యులుగారు, "నేనేమీ బాధపడటం లేదే! మీరు ఏ కారణంగా నన్ను ఓదారుస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఆయన ఎంతో బాధగా, "ఆచార్యులుగారూ..... మీ భార్య...." అంటుండగానే వారు, "ఆమెకేమీ అవలేదు. నిక్షేపంగా వున్నది. కావాలంటే మా యింటికి రండి, చూద్దురుగాని" అంటూ ఆయనను యింటికి తీసుకెళ్ళి చూపించారు. కళ్ళారా ఆమెను చూసిన ఆ డాక్టరు జరిగినదంతా విని, యిది కేవలం ఆచార్యులవారి మహిమ తప్ప మరేదీ కాదని అర్థం చేసుకున్నారు.

ఒకసారి శ్రీ అనంతాచార్యులవారి బంధువు అయిన ఒకామెను క్షయవ్యాధి నివారణకై మదనపల్లిలోని హాస్పిటల్లో చేర్పించారు. శ్రీ అనంతాచార్య ఆమెను చూసేందుకై మదనపల్లి వెళ్ళారు. అక్కడ ఆమె కూర్చున్న విధానము, మాట్లాడే తీరూ చూచి ఆయన ఆమెకు వచ్చిన వ్యాధి 'క్షయ' ఎంత మాత్రం కాదనే నిర్ణయానికి వచ్చి, డాక్టర్లను పిలచి, "ఈమెకు హార్ట్ ఎన్లార్జ్మెంట్ అవటం జరిగింది. ఈమెకు క్షయవ్యాధి లేదు. మీరు మళ్ళీ మరొకసారి అన్ని పరీక్షలు చేసి యీ విషయాన్ని రూఢిపరచుకోవచ్చు" అన్నారు. హాస్పిటల్లోని డాక్టర్లు ఆమెను మరోసారి పరీక్షించి ఆచార్యులుగారు చెప్పినట్లుగా ఆమెది హార్ట్ ఎన్లార్జ్-మెంట్ తప్ప క్షయవ్యాధి కాదని నిర్ధారించుకున్నారు. అత్యంత సునిశితమైన ఆయన గ్రాహ్యశక్తిని వారు ఎంతగానో కొనియాడారు.

ఒకసారి ఒక రోగి శ్రీ అనంతాచార్యులవారి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో బావి దగ్గర స్నానం చేస్తూన్న, అనంతాచార్యులవారు ఆ రోగిని తన ఎదుటకు రమ్మన్నారు. అతడు వచ్చి తన చొక్కా విప్పి చూపాడు. ఒడలంతా పొడలు వ్యాపించి నీరుగారుతూ వున్న పరిస్థితిని చూపి తన వ్యాధిని నివారించవలసిందిగా ఆ రోగి ఆచార్యులవారిని కోరాడు. శ్రీ అనంతాచార్య తాము స్నానం చేస్తున్న బకెట్లోని నీళ్ళు దోసిట్లోకి తీసుకుని అతనిపై నాలుగైదుసార్లు చల్లి, అంతటితో అతని వ్యాధి నివారణౌతుందనీ, అతనికి ఏ ఔషధం అవసరం లేదనీ చెప్పి పంపారు. చిత్రంగా అతని వ్యాధి వెంటనే తగ్గిపోయింది.

ఆయన భార్య శ్రీమతి బుచ్చి వెంకటలక్ష్మిగారు ఆదర్శ గృహిణి. ఆమెకు నలుగురు కుమారుల తర్వాత ఒక ఆడపిల్ల జన్మించింది. ఆ పిల్ల జన్మించిన కొన్ని నెలలకు ఆ తల్లి మరణించారు. శ్రీమతి బుచ్చి వెంకటలక్ష్మి మరణించబోయే ముందు శ్రీ అనంతాచార్యులవారితో తాను మరణించిన తర్వాత పిల్లలను ఏ బంధువులకూ అప్పగించవద్దని, ఆయననే పెంచవలసిందనీ చెప్పారు. ఆయన సంరక్షణలోనే తమ పిల్లలు విజ్ఞానవంతులుగా పెరుగుతారని కనుక పిల్లలను ఎవరికీ యివ్వవద్దనీ ఆమె తమ భర్తను కోరారు. తమకు ప్రాణప్రదమైన పిల్లలను తాను ఒంటరిగానే పెంచుకొనగలననే విశ్వాసంకల

శ్రీ అనంతాచార్య పిల్లలను బంధువులకప్పగించలేదు. తాను మరల వివాహం చేసుకోనూలేదు.

1942వ సం॥లో ఆయనకు 45 సం॥ల వయస్సులో అర్ధాంగి వారిని ఒంటరిని చేసి మరణిస్తే శ్రీ అనంతాచార్య ఏ మాత్రం అధైర్యపడక ఒంటరి గానే బిడ్డల బరువు బాధ్యతలు మోశారు.

శ్రీ అనంతాచార్యులుగారింట్లో చాలాకాలం పనిచేసిన 'లక్ష్మడు' శ్రీ అనంతాచార్యులవారి సతీమణి శ్రీమతి బుచ్చి వెంకటలక్ష్మిగారి గురించి యిలా చెప్పాడు–

"అమ్మగారు చాలా ఉత్తమురాలు. అందరినీ ఎంతో ప్రేమతో చూచుకునేవారు. ఆమె ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడుతుండేవారు. కనుక ఏ పనులూ చేసుకొన లేకపోయేవారు. ఆ కారణంగానే వారికి పనిలో సహాయపడే నిమిత్తం వారింట్లో పనికి నియమింపబడ్డాను. కానీ వారు నన్ను ఏనాడూ పనివాడుగా చూడక, తమ స్వంతబిడ్డవలె చూచుకునేవారు. చంటబ్బాయిగారు పుట్టకముందు నుండీ నేను వారింట్లో వుండేవాడిని. (శ్రీ మాస్టరుగారిని లక్ష్మడు 'చంటబ్బాయి'గారు అనేవాడు) ఇంట్లోని అన్ని పనులూ నేనే చేసేవాడిని. వంట చేసేందుకై బొగ్గుల కుంపట్లు వెలిగించి, వంటకు అవసరమైన పాత్రలు, పదార్థాలు అందించేవాడిని. కూరగాయలు తరిగి పెట్టేవాడిని. అమ్మగారు వంటచేసి, అయ్యగారికి, పిల్లలకు పెట్టి తాను తిని విశ్రమించేవారు. ఆ తర్వాత యిల్లు శుభ్రం చేయటం వంటి పనులన్నీ నేనే చేసేవాడిని.

అయ్యగారు అప్పుడప్పుడు బజారునుండి తినుబండారాలను తెప్పించేవారు. ఆయన తమ నలుగురు పిల్లలను వారికేమి కావాలని అడిగేవారు. ఒకరు గులాబ్ జాం కావాలనీ, ఒకరు పాలకోవా కావాలనీ యిలా నలుగురూ నాలుగురకాలు అడిగేవారు. ఆయన తమ పిల్లలతో పాటు నన్ను కూడా అడిగినప్పుడు పిల్లలు తాము కోరినవి కాకుండా వేరే రకం అడగమని చెప్పేవారు. నేను అదేవిధంగా అడిగేవాడిని. అప్పుడు అందరికీ అయిదు రకాల తినుబండారాలు లభించేవి.

అయ్యగారు నాకు ఆయుర్వేద వైద్యమంతా నేర్పించారు. నాకు భుక్తికి లోటు లేకుండా చూసి, వివాహం కూడా వారే చేశారు".

శ్రీ మాస్టరుగారి చిన్నప్పటి విషయాలు చెపుతూ, "అమ్మగారు అనారోగ్యంతో చాలా బాధపడుతుండేవారు. అయినప్పటికీ పిల్లలను ఎంతో ప్రేమగా చూచుకొనేవారు. పుట్టిన దగ్గరనుండీ చంటబ్బాయిగారిని నా చేతులలో ఎత్తుకొని పెంచాను. అమ్మగారిని నేనే మరచిపోలేకపోయాను. తల్లిలేని చంటబ్బాయిగారిని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోయేది. చంటబ్బాయిగారు తల్లిని గుర్తు తెచ్చుకుంటూ, ఏదో ఆలోచిస్తూ చాలాకాలం వరకు ఎంతో దిగులుగా కనిపించే వారు" అంటూ కన్నీరు కార్చాడు లక్ష్మడు.

చాలా సంవత్సరాలు పిల్లలను ఒక్కరే సంరక్షించుకొని అటు తర్వాత, గృహకృత్యాలను, పిల్లల సంరక్షణ, వైద్యవృత్తి నిర్వహణ ఈ బాధ్యతలన్నీ యింతకు ముందుకంటే పెరగటం, ఒంటరిగా నిర్వహించుకొనటం కష్టమవటంతో వారు కుటుంబ బరువు బాధ్యతలలో పాలుపంచుకొనే సహధర్మచారిణిగా ఉత్తమురాలైన లక్ష్మిగారిని ద్వితీయ వివాహం చేసుకొన్నారు. ఆమె కూడా భర్త, పిల్లల బాధ్యతలను సంతోషంతో స్వీకరించి కుటుంబ నిర్వహణలో ఆయనతో సమానంగా పాలుపంచుకొని ఉత్తమ గృహిణిగా పేరు పొందారు.

**- సశేషం**

## బుద్ధ ధ్యాన హృదయము

19వ పేజీ తరువాయి

ఈ విధంగా కేవలశ్రద్ధ మనోవిజ్ఞానానికి, ప్రపంచ విజ్ఞానానికి యెంతో తోడ్పడుతుంది. అంతే కాక వస్తుతత్వం యొక్క స్పష్ట నిర్వచనంలోను, నిష్పాక్షికమైన గ్రహణశక్తిని పెంపొందించడంలోను, వస్తు నిశ్చయ విషయమై వ్యక్తిగత (Subjective) అంశాలను తగ్గించడంలోను, వస్తుతత్వం సరిగా అవగాహన అయ్యేదాక వస్తునిర్ణయాన్ని నిలపడము మొదలగు అంశాలలో నిజమై శాస్త్రజ్ఞుడి వైఖరిని పోలివుంటుంది. కేవలశ్రద్ధలో వ్యక్తమయ్యే యీ నిజమైన పరిశోధనాదక్షత బౌద్ధధర్మాన్ని నిజమైన శాస్త్రీయ రీతులకు సన్నిహితం చేస్తుంది. అయితే ఐహికమైన శాస్త్రంలాగా నూత్న విషయాలను గుర్తించి వివరించడమే బుద్ధధర్మం యొక్క మనః సిద్ధాంతము కేవలం మానసికము, సిద్ధాంతపరము అయిన జ్ఞానానికి పరిమితమవక మనస్సును, తద్వారా జీవితాన్ని నూత్నంగా రూపొందించటమే లక్ష్యంగా కల్గియుంటుంది. ఈ కల్గియుండడంలో ఆధునిక ఉపయోగాత్మకమైన మనశ్శాస్త్రాన్ని పోలి వుంటుంది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

ఆమె రోజంతా ఆ దండాన్ని చేతిలో పట్టుకొనే వున్నది. రాత్రి అవగానే అమ్మ గురుప్రియను పిలిచి యేకాంతంలో "ఈ దండాన్ని ఒక గుడ్డలో చుట్టి సిద్దేశ్వరి ఆశ్రమానికి వెళ్లి అక్కడ గదిలో యేదో ఒక యెత్తైన ప్రదేశంలో వ్రేలాడదీసి వుంచు" అన్నారు. గురుప్రియ అదే విధంగా చేసింది.

ఆనాటి ఆ సంఘటనలో మరొక సన్నివేశం చోటు చేసుకున్నది. ఆనాటి వుదయం శ్రీ ఆనందమయి మాత గురుప్రియకు దండాన్ని యిచ్చే సమయంలో అక్కడే వున్న అత్తయ్యగారు "ఇక్కడ ఎవరి దగ్గరైనా బ్రహ్మచారులు ధరించే గౌరవర్ణపు వస్త్రం వున్నదా?" అని అక్కడ వున్నవారిని అడిగారు. ఆ మాటకు జవాబుగా అమ్మ "బేబీ అక్క గౌరవర్ణపు వస్త్రం తీసుకొస్తుంది" అన్నారు. బేబీ అక్క అనే భక్తురాలు ప్రతిరోజు అమ్మ దర్శనార్థం ఆశ్రమానికి వస్తూవుంటుంది. అమ్మ ఆదేశం ప్రకారం బేబీ అక్క ఒక తెల్లని క్రొత్తవస్త్రాన్ని కొని, దానికి గౌరవర్ణం వేయించి అమ్మకు తెచ్చి యిచ్చింది. వెంటనే అమ్మ ఆ వస్త్రాన్ని తీసుకొని రమణాశ్రమంలోని తన గదిలోకి వెళ్లి కొంతసేపు తలుపులు మూసుకొని గదిలోనే వుండిపోయారు. ఆ తర్వాత తలుపులు తెరిచి, గురుప్రియను లోపలికి పిలిచి, ఆ వస్త్రాన్ని ఆమె చేతికిచ్చి, "లోపలికి వెళ్లి యీ వస్త్రాన్ని ధరించి, యీ గదిలో కూర్చొని కొంచెంసేపు జపం చేయి. ఆ తరువాత యీ వస్త్రం విప్పి మామూలు వస్త్రం ధరించి బయటకు రా" అన్నారు. గురుప్రియ గదిలో యేకాంతంలో కొంతసేపు జపం చేసుకొని బయటకు రాగానే అమ్మ గురుప్రియతో "గురుప్రియా! నువ్వు యీ వస్త్రాన్ని ధరించి, అప్పుడప్పుడు రాత్రి సమయాల్లో జపం చేసుకుంటూ వుండు. దీనిని ఎంతో గోప్యంగా వుంచుకోవాలి. ఇది ఎంతో పవిత్రమైన వస్త్రం. దీనిని యెవరి కంటా పడనీయకు. రహస్యంగా దాచి వుంచుకో" అని చెప్పారు.

లోగడ కొంతకాలం కిందట శ్రీ ఆనందమయిమాత కొంతమంది యువకులకు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించిన ఘట్టాన్ని ప్రస్తావించుకొన్నాము. ఆ సందర్భంలో గురుప్రియా దేవి అమ్మకు స్నానం చేయిస్తున్న సమయంలో అమ్మ మెడలోని బంగారు గొలుసు అమ్మ భుజం మీదుగా అమ్మ మెడలో యజ్ఞోపవీతంలాగా పడటం జరిగింది. అప్పటినుండి అమ్మ ఆ హారాన్ని అలాగే యజ్ఞోపవీతం లాగే వుంచుకున్నారు. దానితో పాటు మరొక నూలు జంధ్యాన్ని కూడా అమ్మ తన మెడలో వేసుకున్నారు. ఆ తర్వాత ఒక భక్తురాలు తాను స్వయంగా వడికిన నూలుతో ఒక క్రొత్త జంధ్యాన్ని తయారుచేసి తెచ్చి శ్రీ ఆనందమయి అమ్మకు సమర్పించుకుంది. అమ్మ ఆ క్రొత్త జంధ్యం ధరించి పాతది తీసివేశారు.

శ్రీ ఆనందమయి మాతకు సన్నిహిత భక్తుడు, అమ్మకు అత్యంత ప్రీతిపాత్రుడు అయిన జ్యోతిష్ దాదా యెక్కువగా అమ్మ సన్నిధిలోనే వుంటుండేవాడు. అమ్మ అతని గురించి "జ్యోతిష్ దాదా యెంతో వున్నతమైన ఆధ్యాత్మిక స్థితిలో వున్నాడు. అతడు సంసార జీవితం గడుపుతున్నందువలన ఆంతర్యంలో అతని స్థితిని యెవ్వరూ గుర్తించలేకపోతున్నారు" అంటుండేవారు.

షాహ్-బాగ్ లో వుంటున్నప్పుడు ఒకరోజు శ్రీ ఆనందమయి అమ్మ, గురుప్రియ తమ్ముడు నందూ, జ్యోతిష్ దాదా - వీరు ముగ్గురు ఒక గదిలో కూర్చునివున్నారు. అమ్మ వున్నట్లుండి వారితో, "ఇప్పుడు ఈ గదిలో కూర్చుని వున్న మనం ముగ్గురం బ్రాహ్మణులం" అన్నారు. జన్మతః శ్రీ ఆనందమయి మాత బ్రాహ్మణ కులంలో జన్మించారు. నందూ కూడా బ్రాహ్మణ కులస్థుడే. కానీ వైశ్యకులానికి చెందిన జ్యోతిష్ దాదాను అమ్మ బ్రాహ్మణుడు అని అనడం జరిగింది. అలా అంటూ అమ్మ తన మెడలోని బంగారు యజ్ఞోపవీతాన్ని జ్యోతిష్ దాదా మెడలో ధరింపజేశారు. ఆ తర్వాత జ్యోతిష్ దాదా సాధన సమయంలో పాటింపవలసిన నియమ నిబంధనలు సూచించటమే కాక, అతడు తన వంటను తానే స్వహస్తాలతో వండుకొని తినాలన్న నియమం విధించారు. అలా చాలాకాలం అతడి చేత అమ్మ స్వయంపాక నియమాన్ని పాటింపజేశారు.

శ్రీ ఆనందమయి మాత చర్యలు సామాన్యులు అర్థం చేసుకోలేని విధంగా వుండేవి. ముఖ్యంగా ఆమె తరచూ పర్యటనలు చేయటంలోని అంతరార్థం తమ దివ్యపాదస్పర్శతో యావత్ భారతదేశాన్ని పునీతం చేయటం కోసమేనని మనం భావించవచ్చు. నానాటికీ అడుగంటిపోతున్న సనాతన ధర్మాన్ని, దైవభక్తినీ జాతిలో మరలా జాగృతం చేస్తూ ఆమె అనేక ప్రాంతాలు పర్యటించారు. ముఖ్యంగా వందలాది సంవత్సరాలు బ్రిటీష్ పాలకుల కుటిల యుక్తులకు, దేశాన్ని శాశ్వతంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలన్న కోరికతో వారు పన్నిన కుటిల పన్నాగాలకు ఆనాడు మన దేశ ప్రజలు యెన్నో రకాల సమస్యలను, బాధలను యెదుర్కొన్నారు. వారి దుర్మార్గ పాలనలో ప్రజలు అష్టకష్టాలు అనుభవించారు. మన సనాతన ధర్మంపై వారు అవిశ్రాంతంగా చేసే విషప్రచారాలతో, దురదృష్టవశాత్తు ఆ ప్రభావంతో మన దేశప్రజలలో ఆధ్యాత్మిక చింతన, ధర్మాచరణ కొంత మసకబారటం ఆరంభమైంది. అటువంటి క్లిష్ట పరిస్థితులలో శ్రీ ఆనందమయి మాత అవతరించి యావత్ దేశంలో తన లీలలతో, బోధలతో మరల దైవచింతనను, ఆధ్యాత్మికతను పునర్జీవింప చేశారు ఎందరినో ముక్తిమార్గంలో నడిపించి వుద్ధరించారు.

శ్రీ ఆనందమయి మాత తన నాశ్రయించిన భక్తులను ఆధ్యాత్మిక సాధనలో ముందుకు పోయేలా నడిపించేవారు. అమ్మ అందరికీ ఒకే విధమైన సాధన విధించక, వారి వారి సంస్కారాలను బట్టి వేర్వేరు సాధనలను, నియమ నిష్ఠలను ఆయా వ్యక్తులచే పాటింపచేసేవారు. శ్రీ ఆనందమయి అమ్మ యెవరికి యెలాంటి వుపదేశాలు యిస్తారో, భక్తులపట్ల ఆమె ప్రవర్తించే తీరుతెన్నుల గురించి సామాన్య మానవుల అవగాహనకు యేమాత్రం అందనివిగా వుండేవి. అమ్మ ఆదేశాలను తు.చ. తప్పక పాటించే భక్తులు అమ్మ పర్యవేక్షణలో యెంతో అద్భుతమైన రీతిలో సాధనలో పురోగతి పొందటం జరుగుతుండేది. వారు క్రమక్రమంగా గొప్ప ఆధ్యాత్మిక అనుభూతులు చవిచూస్తూ మోక్షమార్గంలో ముందుకు సాగిపోతుండేవారు.

ఢాకాలో పండిత సాహెబ్ అనే సుప్రసిద్ధ లాయరు వుండేవారు. అతని భార్య శ్యామలాదేవి గొప్ప భక్తురాలు. ఆమె తరచుగా మౌనదీక్షలో వుంటుండేవారు. ఆమె శ్రీ ఆనందమయి అమ్మను తరచూ దర్శిస్తూ, తన ఆధ్యాత్మిక అనుభూతులను గురించి తన సాధనలోని సందేహాలను గురించి అమ్మతో చర్చిస్తుండేవారు. శ్యామలాదేవిపై అమ్మకు యెనలేని ప్రేమ. శ్యామలాదేవి వచ్చినప్పుడు అమ్మ ఆమెను తన గదిలోనికి తీసుకొనివెళ్ళి ఆమెతో యెంతోసేపు సంతోషంగా మాట్లాడుతూ గడిపేవారు.

ఒకసారి శ్యామలాదేవి అమ్మను తన ఇంటికి ఆహ్వానించగా అమ్మ వెళ్లారు. శ్యామలాదేవి ఇంట్లోని పూజగదిలో అమ్మ చాలాసేపు ధ్యానమగ్నులై గడిపారు. ఆ సమయంలో ఆ గదిలో వున్న ఒక కమండలాన్ని అమ్మ తన చేతిలోకి తీసుకొని "గురుప్రియా! ఈ కమండలం మనం తీసుకుని వెళ్దాము. నేను దీనితో మంచినీళ్లు త్రాగుతాను" అన్నారు. శ్యామలాదేవి యెంతో సంతోషంగా దానిని అమ్మకి యిచ్చారు. అమ్మ ఆశ్రమానికి తిరిగి వెళ్ళిన తర్వాత చాలా రోజులు ఆ కమండలంతోనే మంచినీళ్లు తాగుతుండేవారు. ఆ తర్వాత అమ్మ దానిని ప్రక్కన పెట్టేయడంతో అది అమ్మ గదిలో ఒక మూలన వుండేది.

ఆ తర్వాత కొన్నాళ్లకు ఒక సంఘటన జరిగింది. ఒకరోజు అమ్మ గదిలో శశాంక బాబు, మరికొందరు భక్తులు అమ్మతో మాట్లాడుతూ కూర్చునివున్నారు. మాటల సందర్భంలో శశాంక బాబు "మంచినీళ్లు త్రాగేటప్పుడు అందరూ త్రాగుతున్నట్లుగా గ్లాసును నోటికి తగలకుండా పట్టుకుని త్రాగటం నాకు చేతకాదు. అందుకని గ్లాసును నోటికి ఆనించుకొని తాగుతుంటాను" అని అమ్మతో అన్నాడు. అమ్మ

"అయితే నువ్వు యీ కమండలంతో త్రాగటం అలవాటు చేసుకో" అంటూ ఆ కమండలాన్ని శశాంకబాబు కిచ్చారు. శశాంకబాబు ఆ కమండలాన్ని భక్తితో అందుకొని ఆనాటి నుండి దానితోనే మంచినీళ్లు త్రాగటం మొదలుపెట్టారు. అమ్మ ఆదేశం యెటువంటిదైనా సరే, శశాంక బాబు దానిని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటించేవారు.

అమ్మ యొక్క ఈ నిగూఢ చర్య అంతరార్థం ఆనాడు యెవ్వరికీ తెలియదు. కాలాంతరంలో అమ్మ శశాంక బాబుకు సన్యాస దీక్ష నిప్పించి అసలైన దండకమండలుధారిని చేసి అతనిని అనుగ్రహించారు.

చాలాకాలంగా కులదా దాదా అనే భక్తుడు శ్రీ ఆనందమయి మాతను తరచు దర్శిస్తూ ఆశ్రమ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ వుండేవాడు. అతనిలోని భక్తి వైరాగ్యాలను గుర్తించిన అమ్మ 1931వ సంవత్సరంలో రమణాశ్రమంలో వచ్చి వుండవలసిందిగా కులదా దాదాను ఆదేశించారు. కులదా దాదా ఆశ్రమంలోనే సాధన కొనసాగిస్తూ అక్కడే నివసించసాగాడు. అయితే అతనికి భార్య, చిన్నచిన్న పిల్లలు వుండటం వలన కుటుంబ నిర్వహణార్థం ఉద్యోగం చేస్తుండేవాడు. రమణాశ్రమం నుండి అతడు ఆఫీసుకి వెళ్లి తిరిగి ఆఫీసు నుండి నేరుగా ఆశ్రమానికే వస్తుండేవాడు. కొన్నాళ్ల తర్వాత కుటుంబ సభ్యుల్ని ఒప్పించి అతడు శాశ్వతంగా రమణాశ్రమంలోనే స్థిరపడిపోయాడు. అటు తర్వాత ఒక్కరోజు కూడా అతడు తన ఇంటి గడప త్రొక్కలేదు. అతడు తన సాధనలో భాగంగా తరచూ మౌనదీక్షలో గడిపేవాడు.

అమ్మ అనేక ప్రదేశాలు పర్యటిస్తున్న సమయంలో ఆయా ఊర్లలోని భక్తులు అమ్మను తమ యిండ్లకు ఆహ్వానిస్తుండేవారు. వారు అమ్మను పూజించుకొని, అమ్మను, వచ్చిన భక్తులను విందు భోజనాలతో సత్కరించేవారు. ఆ భక్తులు అమ్మపై ప్రేమతో అమ్మ కోసం రకరకాల వంటలు సిద్ధం చేసేవారు. గురుప్రియ అనే భక్తురాలు అమ్మకు సన్నిహితంగా వుంటూ, భోజనం తినిపించడంతో సహా అమ్మ సేవలన్నీ స్వయంగా ఆమెయే చేస్తుండేది. అయితే అమ్మ చాలా స్వల్పంగా తింటారు గనుక గురుప్రియ అమ్మకు స్వల్పంగానే తినిపిస్తుండేది.

అది చూచిన భక్తులు అమ్మ చాలా కొంచమే తింటారన్న విషయం తెలియక, 'మేము యింత ప్రేమగా అమ్మకోసం యిన్ని రకాల పదార్థాలు తయారుచేస్తే, యీ భక్తురాలు అమ్మకు మరీ యింత కొంచమే తినిపిస్తుందేమిటి? మరి కాస్త యెక్కువ పెట్టొచ్చు కదా. అసలు యీమె అమ్మకు కడుపునిండా భోజనం పెట్టటం లేదు' అని భావించి బాధ పడసాగారు. కొంతమంది ఆమెతో తమ అసంతృప్తిని వ్యక్తం చేయసాగారు. రాను రానూ తనపై వస్తున్న యీ నిందను సహించలేక గురుప్రియ యిక నుండి అమ్మకు మరి కొంచెం యెక్కువగా భోజనం తినిపించాలని నిర్ణయించుకున్నది. అలా అనుకున్న తర్వాత ఒకరోజు గురుప్రియ అమ్మకు కొంచెం యెక్కువ తినిపించింది. భోజనం చేసిన తర్వాత అమ్మ చేతులు, ముఖము కడుక్కుంటూ "గురుప్రియా! యీ రోజు నువ్వు నాకు ఎక్కువగా భోజనం తినిపించావు కదా?" అన్నారు. గురుప్రియ "అమ్మా! నేను ప్రతి రోజూ మీకు కొంచెం కొంచెంగా నోట్లో పెడుతూ తినిపిస్తుంటే అందరూ మరొక విధంగా అనుకుంటున్నారు. మీరు స్వల్పంగానే తింటారని వాళ్లకు తెలియదు. మీరు మరి కొంచెం యెక్కువగానే తినగలరని, నేనే మీకు సరిగా కడుపునిండా పెట్టటం లేదని నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అందుకే నేను యీ రోజు మీకు కొంచెం యెక్కువ తినిపించాను" అన్నది. ఆ మాటలు వినగానే అమ్మ ముఖం గంభీరంగా మారిపోయింది. అమ్మ "చూడు గురుప్రియా! ప్రతి రోజు నువ్వే కదా నాకు భోజనం తినిపిస్తావు. నేను యెంత తింటానో నీకు తెలుసు. ఈ విధమైన నిందలు, ప్రశంసలు – వీటిపైన దృష్టి సారించకుండా నీ కర్తవ్యాన్ని శ్రద్ధగా పాటించడం నీకు మంచిది. ప్రతి పని నియమ నిష్ఠలతో ధర్మబద్ధంగా చేయటం అవసరం. మన దృష్టి బాహ్య ప్రపంచం వైపు మరలినట్లయితే మన పనిని మనం సరిగా నిర్వర్తించటం సాధ్యం కాదు. ఈరోజు యెక్కువగా తినటం వలన నా శరీరంలో యెటువంటి మార్పు వచ్చిందో నీకు తెలియదు" అన్నారు. అమ్మ బోధించిన ఈ ఉపదేశ సారం గురుప్రియకు బాగా అర్థమైంది. ఆమె తను చేసిన పొరపాటుకు ఎంతో బాధపడింది. లోకుల నిందలకు భయపడి వారి మాటలకు యెక్కువ ప్రాధాన్యతనిచ్చి అమ్మను బాధపెట్టి యెంతటి అపరాధం చేసిందో తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోతూ అమ్మను క్షమాపణ వేడింది గురుప్రియ.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

**శ్రీ న్యాయపతి వినీత్, భువనేశ్వర్**

నా పేరు వినీత్. నేను భువనేశ్వర్ లో బి.టెక్. చదివేటప్పుడు, నా స్నేహితులతో కలిసి ఒక రూమ్ లో వుండేవాడిని. ఆ సమయంలో శ్రీ సాయినాథులవారు ఒకసారి స్వప్న దర్శనమిచ్చి, "అటక కింద కూర్చుని చదవ వద్దు" అని చెప్పారు. మేము అద్దెకున్న గదిలో సామానులు పెట్టుకునే అటక వుండేది. నేను దాని కింద కుర్చీ వేసుకుని కూర్చుని చదువుకునేవాడిని. అక్కడ నాకు చదువుకోవడానికి వీలుగా వుండేది. అయితే బాబా అటక కింద కూర్చోవద్దు అని చెప్తూ "అటక మీద చిన్న కర్రముక్క వుంది, దాన్ని విరగ్గొట్టు" అని కూడా చెప్పారు. మర్నాడు బాబా చెప్పారుకదా అని, అటక మీద కర్ర ఏమైనా వుందేమోనని వెదికాను. నాకు ఏమీ కనిపించలేదు. అటక మీద నా పుస్తకాల బ్యాగ్ లో చెక్కతో చేసిన 'N' అక్షరం వున్న కీచైన్ వుండేది. ఆ రోజు నేను తాళం వేద్దామని కీచైన్ తీసేసరికి చెక్కతో వున్న N అక్షరం విరిగి పోయివుంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది, నా ప్రయత్నం ఏమీ లేకుండానే అది ఎలా విరిగిపోయింది అని!

నాతో బాబా స్వప్నంలో అలా చెప్పడానికి, ఇప్పుడు ఈ కీచైన్ విరగడానికి ఏమైనా సంబంధముందేమో అనిపించింది గాని ఇదమిత్థంగా తెలియలేదు. తర్వాత కొన్ని రోజులకి నాకు ఒక పెద్ద ప్రమాదం తప్పింది. నేను నా స్నేహితులతో నడిచి వెళ్తుంటే, ఎదురుకుండా ఒక కారు చాలా దగ్గరగా నా కాలుని రాసుకుంటూ వెళ్ళిపోయింది. అసలు నా కాలు దాని కిందపడి విరిగి పోవాల్సిందే! లిప్తపాటులో వెళ్ళిపోయిన కారుని వెనక్కి తిరిగి చూశాను, దాంట్లో అబ్బాయిలు బాగా తాగి డ్రైవ్ చేస్తున్నారు. ఇంక ఏం మాట్లాడినా ఉపయోగం లేదని ఊరుకున్నాను. నా కాలుకి బదులు బాబా నా చెక్క కీచైన్ కి వున్న N(న్యాయపతి) అనే అక్షరాన్ని విరగ్గొట్టి నన్ను కాపాడారని అర్థమయ్యి కృతజ్ఞతతో అంజలి ఘటించాను.




ఇంకొకసారి, మర్నాడు నా పుట్టినరోజు అనగా ముందు రోజు రాత్రి ఒక స్వప్నం వచ్చింది. శిరిడి దగ్గర "రూయి" గ్రామంలో, సాయిబాబా గుడి వుంది. నేను, అమ్మ, ఆ గుడికి వెళ్లాం. అక్కడ సాయిబాబా విగ్రహం వున్న స్థలంలో బాబా శరీరంతో కూర్చుని వున్నారు. నేను, అమ్మ బాబాకి నమస్కరించుకున్నాక, అమ్మ బాబాతో "ఈరోజు మా వినీత్ పుట్టినరోజు. ఆశీస్సులు ఇవ్వండి బాబా" అని ప్రార్థించింది. వెంటనే బాబా నన్ను దగ్గరికి తీసుకొని నా ఒళ్ళంతా నిమిరి ఆశీస్సులిచ్చారు. మేమిద్దరం బాబాకు నమస్కారం చేసుకొని వెనుతిరిగి వస్తుంటే, బాబా అక్కడే పడుకున్నారు. అంతటితో స్వప్నం ముగిసింది. నా పుట్టిన రోజుకి, బాబా అంత మంచి ఆశీర్వాదం ఇచ్చినందుకు చాలా సంతోషం వేసింది. ఇలా చాలా సందర్భాలలో నాకు బాబా స్వప్న దర్శనాలు యిచ్చారు.

ఒక సందర్భంలో నేను ఇక ఎక్కలేను అనుకున్న రైలుని ఎక్కించారు. ఒకసారి నేను కర్నూలు వెళ్ళాను. తిరిగి భువనేశ్వర్ రావడానికి 'డోన్' స్టేషన్ లో రాత్రి గం.9.10ని.లకి రైలు ఎక్కాలి. కర్నూలులో కుండపోతగా వర్షం వచ్చి రాత్రి 8గంటల వరకు బస్సు బయలుదేరలేదు. అక్కడనించి డోన్ బస్టాండ్ కి ఒక గంట ప్రయాణం. డోన్ బస్టాండు నించి రైల్వే స్టేషనుకి వెళ్లాలి. ఆ రోజు నాకు ఆ రైలు అందటం కష్టమే! అయినా సరే ప్రయాణం మానలేదు. బాబా నామస్మరణ చేస్తూనే వున్నాను. తొమ్మిది గంటలకి బస్సు డోన్ బస్టాండుకి చేరుకుంది. వెంటనే ఆటో ఎక్కినా కూడా పావుగంట కన్నా తక్కువ సమయంలో రైల్వే స్టేషన్ చేరుకోలేను. స్టేషన్ చేరుకున్నాక మూడో ప్లాట్ ఫారం కి వెళ్లాలి. ఇవన్నీ జరుగుతాయా? సరే ఏదైతే అది జరుగుతుందని, బస్సు దిగి వెంటనే ఆటో ఎక్కాను. మనసులో నామస్మరణ జరుగుతోంది. చిత్రంగా ఆ రైలు ఔటర్లో నిలిపివేయబడి, నేను మూడో నెంబర్ ప్లాట్ ఫారం చేరుకున్నాకే వచ్చింది! రైలు ఎక్కి, నా సీట్లో కూర్చున్నాక ఒక్కసారి జరిగిందంతా తలుచుకుని చాలా ఆశ్చర్యానందాలకు లోనయ్యాను. పరిస్థితులన్నీ మారుస్తూ, చేజారిపోయే అవకాశాన్ని కూడా చేజిక్కించిన బాబాకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

ఇలా ఎన్నో ఎన్నెన్నో సంఘటనల్లో బాబా నన్ను రక్షిస్తూనే వున్నారు. దానికి కారణం కూడా ఉంది. మా అమ్మగారు శ్రీమతి న్యాయపతి రేవతిగారు గర్భవతిగా వున్నప్పుడు, బాబా స్వప్న దర్శనమిచ్చి 'నీకు అబ్బాయి పుడతాడు' అని చెప్పారట. అమ్మని కాన్పు కోసం ఆసుపత్రిలో చేర్చాక, మా నాన్నగారైన శ్రీ జగన్నాథరావుగారి ముందు ఒక కాంతి లాగా వచ్చి అందులో బాబా కనిపించి, "రేపు సాయంత్రం గం.6.12ని.లకు అబ్బాయి పుడతాడు" అని చెప్పారట. మర్నాడు సాయంత్రం సరిగ్గా అదే సమయానికి నేను పుట్టాను. అందువల్ల నాకు బాబా ఎల్లప్పుడూ తోడుగా వుంటారని నా విశ్వాసం.

పూజ్యశ్రీ బాబాగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు మాకు ప్రత్యక్ష దైవాలు. వారందరి ఆశీస్సులు మా కుటుంబం పై ఎల్లప్పుడూ వుండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

## ఆచార్యులవారి సన్నిధిలో ఒక రోజు

౧౫వ పేజీ తరువాయి

వారందరూ విని అట్టి అవకాశము లభించినందుకు ఎంతో ఆనందించారు. వారిలో కొందరు అన్నారు కూడా, "మమ్మల్ని చాలామంది ఈ ప్రశ్న అడుగుతూవుంటారు. ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో మాకు అర్థంకాక తికమక పడుతూ వుంటాము. ఈరోజు మాకు బాగా అర్థమైంది. మాకు యిలాంటి విషయాలు యింకా యింకా బోధిస్తే యింకా బాగుంటుంది".

మరికొంతసేపు విషయాలమీదే సంభాషణలు కొనసాగాయి. ఆ తర్వాత కొందరు స్వంత విషయాలు మాట్లాడారు. అప్పటికి రాత్రి గం॥ 10:30 లు అవడంతో అందరూ మాస్టరుగారి వద్ద ఊదీ, ప్రసాదమూ తీసుకొని సెలవు తీసుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా సత్సంగహాలులోంచి లోపలికి వచ్చారు. కొద్దిగా వుపాహారము తీసుకుని మళ్ళీ ఒకతనికి వ్యాసాలు వ్రాయమని అడిగి వ్యాసం చెప్పడం మొదలు పెట్టారు. రాత్రి 12 గం॥లు అవడంతో అతనికి నిద్ర తూగింది. "నీకు నిద్రవస్తున్నట్లున్నది, పోయి పడుకో!" అని అతనిని పంపివేశారు.

ఆ తర్వాత ఆయన సుమారు రెండు రెండున్నర దాకా సమశ్లోకి శ్రీ గురుచరిత్ర చదివి నిద్రకుపక్రమించారు.

ఇలా ప్రతిరోజూ ఆయన చేసే పనులెన్నో. ఏరోజుకారోజు ప్రత్యేకముగానే వుండేది. ప్రతిరోజూ ఆయన చర్యలు గమనించిన వారికి, ఆయన అమృత వాక్కులు వినినవారికి ఎంతో ఆనందము, ఆశ్చర్యము కూడా కలుగుతూవుండేవి. ఆయన చెప్పే విషయాలు నిక్షిప్తము చేసుకోలేకపోవడము మన దురదృష్టము. మనకు ఎంత ప్రాప్తమో అంత మాత్రమే లభించింది. ఆయన ఒక అనంతసాగరము. అమృతభాండాగారము. ఆయనను చూడనివారికి ఎవరైనా "యిలా ఈ ప్రపంచంలో జీవించడం సాధ్యమా?" అని సందేహం కలగడం కూడా సహజమే. కానీ యిది పచ్చినిజం, సత్యం.

పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ శిరిడీ సాయినాథుని వద్ద ఆత్మానుభూతిని పొందిన రోజును పురస్కరించుకొని ఆయన సన్నిధిలో ఒకరోజు ఎలా గడిచిందో క్లుప్తంగా స్మరించుకున్నాము. ఈ విషయాలను మన హృదయాలలో ప్రతిష్ఠించుకొందుము గాక! ●

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీమతి శిరీష, ఒంగోలు**

పూజ్య భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని ఒంగోలు వాస్తవ్యురాలు శ్రీమతి శిరీష ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నేను పదవ తరగతి పాసైన తరువాత కుటుంబ పరిస్థితుల కారణంగా మేము 2005లో ఒంగోలుకు వచ్చాము. హరిహరనాథ్ గారి అమ్మగారి ఇంటి ప్రక్కనే మేము ఇల్లు అద్దెకు తీసుకున్నాం. ఆవిడ నన్ను బాబాగుడికి తీసుకువెళ్ళారు. అప్పుడే నేను మొదటిసారి పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం చూశాను. అక్కడ జయరాంగారు నాకు పరిచయమయ్యారు. నాకు చదువుకోవాలని వుందని, కానీ నా ఆర్థిక పరిస్థితి కారణంగా ఫీజు కట్టలేననీ వారితో చెప్పాను. అప్పుడు జయరాంగారు కొంతమంది సత్సంగసభ్యుల సహాయంతో నన్ను ఇంటర్ చదివించారు. మంచి మార్కులతో ఇంటర్ పాసయ్యాను. ప్రతిరోజూ కళాశాలనుంచి రాగానే బాబాగుడికి వెళ్లడం, పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిదగ్గర, అన్నదానంలోనూ, బాబాగుడిలోనూ సేవచేసుకోవడం, పారాయణ చేసుకోవడం... ఇదీ నా నిత్యకృత్యం. ఎక్కువభాగం గుడిలోనే గడిపేదాన్ని.

ఇంటర్ అయ్యాక డిగ్రీ చదువుకోవడానికి కూడా వారు నాకు అలాగే సహాయం చేశారు. అప్పట్లో సాయిమందిర్ కమిటీ, సాయిమాస్టర్ గురుబంధువులు కలిసి ఫీజు కట్టుకోలేని విద్యార్థులకు ఉపకారవేతనం(స్కాలర్షిప్) యిచ్చేవారు. దానికి జయరాంగారు నన్ను దరఖాస్తు చేసుకోమన్నారు. ఆ సహాయంతో 2010లో BSC (కంప్యూటర్స్) పూర్తిచేశాను. ఆ తరువాత MCA కూడా పూర్తిచేశాను. పూజ్యశ్రీ మాస్టరుగారు పదవ తరగతిలో ఆగిపోవాల్సిన నా చదువును పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు పూర్తిచేయించారు. ఇదంతా వారి ప్రణాళికలో భాగమని తరవాత అర్థమైంది.

ఒంగోలులో నా చదువు పూర్తయ్యాక ఉద్యోగ నిమిత్తం నేను హైదరాబాదుకు వచ్చాను. అప్పుడు హరిగారు దత్తక్షేత్రాలయాత్ర వేశారు. ఆ యాత్రకి నేను కూడా వెళ్లాను. ఇక రెండురోజులకు నర్సోబావాడి వెళతామనగా నాకు ఒక కల వచ్చింది.

అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు తెల్ల లుంగీ, తెల్ల బనీను వేసుకుని వున్నారు. అడవిలాగా వుండి బాగా చెట్లతో నిండివున్న ప్రాంతంలో సన్నని దారిగుండా నడుస్తూ నాతో, "నీకు పెళ్లవుతుంది!" అని చెప్పారు. అదే కలలో ఒకచోట పందిరి వేసి వుంది. పందిరి రాటకు బాబా ఫోటో వుంది. బాబాఫోటోను ఒక కుర్చీలో పెట్టి, "మీ దంపతులిద్దరూ బాబాకు ప్రదక్షిణలు చెయ్యండి!" అని చెప్తున్నారు పూజ్యశ్రీ మాస్టరుగారు. మేమిద్దరం మెడలో దండలతో ప్రదక్షిణలు చేసుకున్నాము. అయితే నాకు అతని మొహం స్పష్టంగా కనిపించలేదు. ఈ స్వప్నాన్ని నేను నర్సోబావాడిలో గురుబంధువులందరికీ చెప్పాను.

నేను హైదరాబాదులో వున్నప్పుడు శశికళ అనే అమ్మాయి నన్ను నాంపల్లిబాబా మందిరానికి తీసుకువెళ్ళింది. అక్కడ నరసింహన్ గారు పరిచయమయ్యారు. వారి కుటుంబసభ్యులతో కూడా నాకు పరిచయమైంది. ఆయన ద్వారానే నాకు పెళ్లి జరిగింది. పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు వివాహం చేసిన విధం చాలా చిత్రంగా వుంటుంది. మావారి పేరు పృథ్వి. ఆయన కూడా నాంపల్లిబాబా

మందిరానికి వచ్చేవారు. కానీ నేను ఆయనను ఎప్పుడూ కలవలేదు. మావారికి చిన్నప్పటినుంచి దైవభక్తి ఎక్కువ. వారిది బాపట్ల. అక్కడ శివాలయానికి ఎక్కువ వెళ్లేవారట. అప్పుడు ఒకసారి ఎవరో కలలో శివుడు, బాబా ఒక్కరే అని చెప్తున్నారట. అప్పటినుంచి బాబాగుడికి వెళ్లడం మొదలుపెట్టారు.

డిగ్రీ చివరి సంవత్సరంలో పరీక్షాపత్రాలు దిద్ది, మార్కులు వేసేటప్పుడు జరిగిన పొరపాటువల్ల మొదటిశ్రేణిలో ఉత్తీర్ణులవుతారనుకున్న మావారిని పరీక్ష ఫెయిల్ అయినట్లు ప్రకటించారు. ఏదో పొరపాటు జరిగిందని భావించి బాబాతో, 'ఇది సరిచేస్తే, నిన్నే నమ్ముకుంటాన'ని నమస్కారం చేసుకున్నారట. తరవాత పొరపాటు దిద్దబడి మొదటి తరగతిలో ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. అది 2001వ సంవత్సరం. అప్పటినుంచి సాయి సచ్చరిత్ర పారాయణ చేయడం మొదలుపెట్టారు.

తరవాత తరచుగా గొలగమూడి వెళుతుండేవారు. అక్కడ ఈయనకి పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన శ్రీ సాయిలీలామృతం గ్రంథం లభించింది. అప్పటినుంచి ఆ గ్రంథాన్నే పారాయణ చేస్తున్నారు. తరవాత MBA పూర్తిచేశారు. HSBC బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. దాన్లో ఫైనాన్స్‌డిపార్ట్మెంటులో చేసేవారు. మావారు నాంపల్లిబాబా గుడికి వచ్చినపుడు బాబాను ఆధ్యాత్మికచింతన వున్న అమ్మాయితో పెళ్లి కుదర్చమని మొక్కుకుని ప్రదక్షిణలు చేసేవారట.

మావారికికూడానరసింహన్‌గారితోపరిచయమైంది. పెళ్ళివిషయంలో ఆయనకున్న అభిప్రాయాన్ని నరసింహన్ గారితో చెప్పారట. కొన్నిరోజులు గా నేను కూడా నాంపల్లిబాబా గుడికి రావడం, నాకు కూడా నరసింహన్ గారితో పరిచయమవ్వటం, అంతకుముందు నేను పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిమందిరంలో సేవచేసుకున్నానని ఆయనకు తెలియడంతో, మా ఇద్దరికీ పెళ్లి జరిగితే బాగుండుననిపించి నరసింహన్ గారి ఇంట్లోనే మాకు పెళ్ళిచూపులు ఏర్పాటుచేశారు. మావారి కోరిక ప్రకారం మహాత్ములసేవ, పారాయణలు చేసుకునే అమ్మాయిని అవ్వడంతో వెంటనే ఒప్పుకున్నారు. 2015లో మాకు వివాహం జరిగింది. పెళ్లయిన మూడవరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధిమందిరానికి ఇద్దరం వెళ్లి నమస్కారం చేసుకున్నాము. ఈవిధంగా ఆరోజు నా కలలో చెప్పిన మాట పూజ్యశ్రీ మాస్టరుగారు నెరవేర్చారు.

2016లో మాకు పాప పుట్టింది. 2021 అక్టోబరులో బాబు పుట్టాడు. 2021లో మావారికి ఉద్యోగంలో వేరే టీము(team) కి మారుస్తామని చెప్పారు. అది చాలా మంచి అవకాశం. కానీ ఆ విషయం ఎంతకీ తేల్చటం లేదు. ఇంటినుంచే పని చెయ్యాలి కాబట్టి మేము మా మకాం ఒంగోలుకి మార్చేశాము. ఈలోగా పూజ్యశ్రీ అమ్మగారు సిద్ధిపొంది ఒంగోలు దగ్గరకు వచ్చేశారు. మావారికి పూజ్యశ్రీ అమ్మగారి సమాధి దర్శనం చేసుకోగానే విపరీతమైన శాంతి అనుభవమైందట. అప్పటినుంచి మండలారాధన వరకూ ప్రతిరోజూ పూజ్యశ్రీ అమ్మగారికి ఉదయమే టిఫిన్ ప్రసాదం తీసుకుని వెళ్లేవారు. తరవాత పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి కూడా మండలం రోజులు ప్రదక్షిణలు చేసుకున్నారు. దాని తరవాత మావారి ఉద్యోగంలో మేము ఊహించని గొప్ప మార్పులొచ్చాయి. మంచి జీతంతో ఫైనాన్స్ నుంచి సాఫ్ట్ వేర్ కి, వేరే టీములోకి మార్చారు!

ఇలా అనుక్షణం వారి అనుగ్రహం కురిపిస్తూనే వున్నారు. ఒంగోలులోనే పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు వుండటంవల్ల వారి సన్నిధిలో వుందామన్న ఉద్దేశంతో ఇల్లు కట్టుకోవడానికి స్థలం కూడా కొనుక్కున్నాము.

ఏ జన్మ సంబంధమో, నా కుటుంబ పరిస్థితులు అడ్డుపెట్టుకుని నన్ను ఒంగోలు రప్పించుకుని, నాకు తగిన వరుడితో పెళ్ళి జరిపించి, ఒక పాపని, బాబుని కూడా ప్రసాదించి, మళ్ళీ నన్ను తన దగ్గరకి చేర్చుకున్న పూజ్యశ్రీ మాస్టరుగారి అంతులేని వాత్సల్యానికి, జన్మజన్మలకూ మా భార్యాభర్తలం ఋణపడివుంటాం. ఆ ఋణం వారి సేవ ద్వారా, సాంగత్యం ద్వారా నెరవేర్చమని వారి పాదపద్మాలకు సహస్రవందనాలు సమర్పిస్తూ ప్రార్థిస్తున్నాము.

ఓం భక్తభారభృతాయ శ్రీ భరద్వాజ సద్గురవే నమః!

జై సాయి మాస్టర్!!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము | ₹20.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |
| అవధూత శ్రీ చివటం అమ్మ | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి | ₹199.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | ₹149.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| భగవాన్ శ్రీ భరద్వాజ | ₹299.00 |
| (రచన : శ్రీమతి శ్రీదేవి) | |
| మహా పురుషుడు | ₹60.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| ఆచార్య అమృత లేఖావళి | ₹199.00 |
| (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు | ₹99.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము | ₹49.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల సాయిసన్నిధి | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల శ్రీ గురు చరిత్ర | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master | ₹80.00 |
| *(Author: Smt. Adidam Vedavati)* | |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము, గుమ్మళంపాడులో మే నెల 12వ తేదీన (ఆదివారము) 'శ్రీ సాయి లీలామృతము మహా గ్రంథ కృతజ్ఞతార్చన' పూజ్య గురు పుత్రిక శ్రీమతి అడిదం వేదవతి గారి ఆధ్వర్యంలో జరిగింది.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



# అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధన

13-06-2024 (తిథి-జ్యేష్ఠ శుద్ధ సప్తమి)

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.